
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సిద్దిపేట



20

శనివారం 19 ఆగస్టు 2017



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రాజమణి

సీనరేజీ గ్రాంట్‌ను విడుదల చేయించాలి

స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల డిమాండ్

వివరాలు 2లో..



మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి, పక్కన హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి

కార్పొరేట్‌ను మించి వైద్యమందిస్తాం

రాష్ట్రంలోనే మొదటి డయాలసిస్ కేంద్రం ఇక్కడే

రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా డయాలసిస్ కేంద్రాన్ని సిద్దిపేటలో ప్రారంభించుకున్నందుకు సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు మించి మెరుగైన వైద్యం అందిస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని మంత్రులు లక్ష్మా రెడ్డి, హరీశ్‌రావు ప్రారంభించారు. 5 లో


- దేశంలోనే మొట్టమొదటిసారిగా సింగిల్ యూసేజ్ ఫిల్టర్
- రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి
- సుష్మలాంటి వారందరి కోసమే ఈ డయాలసిస్ కేంద్రం
- నాసిరకం కాదు నాణ్యమైన మిషన్లున్నాయి
- నేడు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నారు
- నెల రోజుల్లో 300 పడకల ఆస్పత్రిని ప్రారంభించుకుందాం
- కిడ్నీ వ్యాధిగ్రస్థులకు ఉచిత బస్‌పాస్‌లు
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు
- భూ నిర్వాసితులకు రూ.2.25 కోట్ల చెక్కులు అందజేత



మొదటి రోజు కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



రోదిస్తున్న కుటుంబీకులు



ఆంజనేయులు (ఫైల్‌ఫొటో)

పంటలు ఎండి గుండె పగిలిన రైతన్న

- అప్పులు తీర్చే దారి లేక విష గుళికలు మింగి ఆత్మహత్య
- బండారుపల్లిలో విషాదఛాయలు

వివరాలు 3లో..

ఇబ్రహీంపూర్ పాఠశాలకు

డబుల్ ధమాకా

- ఇటీవల రాష్ట్ర, ఇప్పుడు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఎంపిక
- 1న ఢిల్లీలో అవార్డుతో పాటు రూ. 50,000 ప్రదానం
- అభివృద్ధికి హరీశ్ ప్రత్యేక చొరవ

ఇబ్రహీంపూర్ ప్రాథమిక పాఠశాలకు డబుల్ ధమాకా.. ఇటీవల రాష్ట్రస్థాయి 'స్వచ్ఛ పురస్కార్' అవార్డు పొందిన ఇబ్రహీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఇప్పుడు జాతీయ 'స్వచ్ఛ పురస్కార్' అవార్డుకు ఎంపికైంది. మంత్రి హరీశ్‌రావు ఆలోచనా విధానం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ఆచరణ ఫలితం పాఠశాలకు జాతీయ అవార్డును తెచ్చిపెట్టాయి. దీంతో ఆ గ్రామంతో పాటు సిద్దిపేట ఖ్యాతి మరింత పెరిగింది. 20 లో



ఇబ్రహీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల

పేకాట రాయుళ్ల అరెస్టు

హుస్నాబాద్‌రూరల్: మండలంలలోఒని పోతారం(ఎస్)లో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2630 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు చేసి పెసరు రాములు, నంగునూరి సతీష్, మల్లం సదానందం, పిట్టల అయిలయ్య, మామిడి శేఖర్, మామిడి శ్రీనివాస్‌లను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీనరేజీ గ్రాంట్‌ను విడుదల చేయించాలి

• స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల డిమాండ్

సంగారెడ్డి టౌన్ : జిల్లా పరిషత్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన సీనరేజీ గ్రాంట్‌తోపాటు ట్రాన్స్‌ఫర్ డ్యూటీస్‌ను విడుదల చేయించాలని పలువురు జడ్పీటీసీలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ రాజమణిమురళీయాదవ్ అధ్యక్షతన గ్రామీణ అభివృద్ధి (రెండో స్థాయీ సంఘ), విద్యా వైద్యం (నాల్గో స్థాయీ సంఘం) సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి, ఉపాధిహామీ పథకం, జిల్లా పంచాయతీ విభాగం, యువజన, క్రీడల సంక్షేమం, ఉపాధి కల్పన, ఆర్టీసీ, పీసీబీ, జిల్లా సహకార సంస్థ, గృహనిర్మాణం, విద్యా, వైద్య ఆరోగ్యం, వయోజన విద్య, గ్రంథాలయ శాఖలపై సమీక్షించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు సీనరేజీ గ్రాంట్‌తోపాటు ట్రాన్స్‌ఫర్ డ్యూటీస్ విడుదల కాకపోవడంతో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. గనుల శాఖ ద్వారా ఇచ్చిన అనుమతుల కంటే ఎక్కువగా మొరాన్ని తరలిస్తూ కాంట్రాక్టర్లు అమ్ముకుంటున్నారని దీనిపై విచారణ చేపట్టాలన్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించి అర్హులైన వారికి లాటరీ విధానం ద్వారా ఇళ్లను కేటాయించాలని సూచించారు.శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న పాఠశాలలను గుర్తించి వెంటనే కూల్చి వేయాలని సూచించారు. సీఈవో రవి, జడ్పీటీసీలు రజియోద్దీన్ అహ్మద్, కొత్తపల్లి శారద, పడాల నాగరాణి, బాలగోని రామాగౌడ్, స్వరూప, కిషన్‌రావుపవర్, జడ్పి పర్యవేక్షకుడు ఎం.జమ్లానాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడిని అంబులెన్స్ నుంచి బయటకు తీస్తున్న స్థానికులు

బెజ్జంకి: దుబాయ్‌లో మృతి చెందిన వ్యక్తి మృత దేహన్ని ఎయిర్ పోర్టు నుంచి అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా మండలంలోని రాజీవ్ రహదారిపై ఆ వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, క్షత గాత్రులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లపెగడపల్ల మండలం రాములపల్లి గ్రామానికి చెందిన బడుగు రాజయ్య దుబాయ్‌లో మృతి చెందాడు. ఆయన మృతదేహన్ని బంధువులు అయిన లక్ష్మీనారాయణ, రాజేశం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి అంబులెన్సులో స్వగ్రామానికి తీసుకెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై వర్షం పడుతుండటంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ఉన్న లక్ష్మీనారాయణకు చేయి విరుగగా రాజేశంకు డ్రైవర్ రమేశ్‌లకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో వర్షం కారణంగా వాహనాలు అదుపు తప్పి అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు.

పంటలు ఎండి రైతు ఆత్మహత్య

• బండారుపల్లిలో విషాదం



ఎండిపోయిన ఆంజనేయులు సాగు చేసిన మొక్కజొన్న

తొగుట: అప్పు చేసి పంటలు సాగుచేసినా వరుణుడు ముఖంచాటేయడంతో కళ్ల ముందే పంటలు ఎండిపోయాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రైతు విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ హృదయ విధారక సంఘటన తొగుట మండలం బండారుపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన తలారి ఆంజనేయులు(42) వార సత్వంగా వచ్చిన ఎకరంన్నర పొలంతోపాటు గ్రామానికిచెందిన కొందరి భూములను కౌలుకు చేసేవాడు. ఐదేళ్లుగా ఆంజనేయులు ఈ విధంగానే సాగుచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే పంటసాగుకు 5లక్షల వరకు చేసిన అప్పులు చేశాడు. అప్పులు తీర్చాలనే ఉద్దేశంతో ఈ ఏడాది గ్రామానికి చెందిన గంధం రాజిరెడ్డికి చెందిన 6 ఎకరాల వ్యవసాయ పొలాన్ని 30 వేలకు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. కానీ, వర్షాలు లేకపోవడంతో తన సొంత పొలంలో వేసిన మొక్కజొన్నతోపాటు కౌలుకు సాగు చేసిన వరి పంటలు ఎండిపోయాయి. పొలంలోని రెండు బోరుమోటార్లు కూడా కాలిపోయాయి. బోరుమోటార్లను మరమ్మతు చేయించేందుకు డబ్బుల్లేక పంటను కాపాడుకోలేక ఆంజనేయులు తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. వరి పొలంలో చల్లడానికి తీసుకువచ్చిన విషగుళికలను గురువారం రాత్రి మింగి ఇంటికి చేరుకుని మృతిచెందాడు. ఆయనకు భార్య సులోచన, కూతురు రమ్య ఉన్నారు. కుటుంబీల రోధన గ్రామస్థులందరినీ కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ రాజవ్వ, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు పర్శరాం కోరారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



రాము మృతదేహం

హత్నూర: మగతనం లేదని భార్య అవమానించడంతో మనస్థాపానికి గురైన భర్త ఇంట్లో ఉరేసుకున్న సంఘటన మండలంలోని దౌల్తాబాద్‌లో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన బొల్లారం రాము (25)కు చిట్కూల్ గ్రామానికి చెందిన లావణ్యతో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. కొద్ది రోజుల క్రితం లావణ్య తన పుట్టింటికి వెళ్లిపోవడంతో భర్త రాము ఇటీవల తీసుకురావడానికి వెళ్లాడు. అయినప్పటికీ ఆమె అత్తగారింటికి రావడానికి నిరాకరించి అక్కడే ఉండిపోయింది. దీంతో ఈనెల 17న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా, వారందరి ముందు నా భర్తకు మగతనం లేన్నందున నేను సంసారం చేయనని చెప్పడంతో మనస్థాపానికి గురైన రాము గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున అది గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చా రు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బ్యాంక్ మేనేజర్‌ను దూషించినందుకు ఐదుగురిపై కేసు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్‌పై దురుసుగా ప్రవర్తిస్తూ, బూతు మాటలతో దూషించినందుకు శుక్రవారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపా రు. పట్టణానికి చెందిన అన్వర్ హుస్సేన్, ఎ జాజ్‌అలీ, ఇలియాస్, షకీల్, తాజోద్దీన్ అనే వ్యక్తులు పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ వికాస్‌రంజన్ మహాలిపై లోను విషయంలో బూతు మాటలు తిడుతూ విధులను అటం క పర్చడమే కాకుండా దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. మేనేజర్ ఇచ్చిన ఫిర్యా దు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.

పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

\- మేనేజర్



ఖాతా గ్రామంలో భూమిని పరిశీలిస్తున్న జేసీ పద్మాకర్

సాగు భూములనే పంపిణీ చేస్తాం

• భూములను పరిశీలించిన జేసీ పద్మాకర్

నంగునూరు: దళితులకు భూపంపిణీ కార్యక్రమంలో భాగంగా సాగుకు యోగ్యమైన భూములను ప్రభుత్వం కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నదని జాయింట్ కలెక్టర్ పద్మాకర్ అన్నారు. శుక్రవారం నంగునూరు మండలంలోని ఖాత గ్రామంలో దళితులకు మూడెకరాల భూపంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన భూములను పరిశీలించి మాట్లాడారు. దళితులకు భూపంపిణీ పథకం కింద భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ముందుకు వచ్చి భూములు ఇస్తే మార్కెట్ ధర ప్రకారం డబ్బు చెల్పిస్తామన్నారు. జేసీ వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చరన్‌దాసు, తహసీల్దార్ విజయభాస్కర్‌జీ, సర్పంచ్ కత్తుల రాధికచంద్రారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింలుగౌడ్ తదితరులున్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

• జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌చందర్



కొండపాకలో ఎంఆర్ టీకా ఇస్తున్న వైద్యాధికారి

కొండపాక: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌చందర్ అన్నారు. మండలంలోని మర్పడగ, సిర్సినగండ్ల, కొండపాక గ్రామాల్లో ఎంఆర్ వ్యాక్సినేషన్ శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా సిర్సినగండ్ల, కొండపాక గ్రామాల్లో పిల్లలకు ఆయన టీకా ఇచ్చారు. అనంతరం ప్రవీణ్‌చందర్ మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటే ఎలాంటి సమస్యలుండవని ముందస్తుగా వ్యాధులు రాకుండా మందు వేయడానికి ప్రభుత్వం తగుచర్యలు తీసుకుంటున్నదన్నారు. ప్రాణాంతక వ్యాధులైన మీజిల్స్, రుబెల్లా రాకుండా ఎంఆర్ టీకాను ఇస్తున్నట్లు తెలిపారు. దీనిని 9 నెలల వయస్సు నుంచి 15 సంవత్సరాల వయస్సులోపు పిల్లలు తప్పకుండా వేయించుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది ప్రణాళిక ప్రకారం వ్యాక్సినేషన్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెమో నర్సింహా, సిబ్బంది పద్మ, విజయలక్ష్మి, చంద్రకళ, లక్ష్మి, ఆశావర్కర్ కనకమ్మ పాల్గొన్నారు.

'వ్యాధి రాకుండా ఉండడానికి వ్యాక్సిన్'


కొండపాక: భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులైన మీజిల్స్, రుబెల్లా వ్యాధులు రాకుండా ఉండడానికి వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ విక్రం తెలిపారు. కుకునూర్‌పల్లి పీహెచ్‌సీ, కొండపాక కేజీబీవీలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 9 నెలలు నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలందరూ టీకా తీసుకోవాలని సూచించారు. కుకునూర్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలో రెండో రోజు 925 మందికి వ్యాక్సిన్ వేసినట్టు వైద్యాధికారి శ్రీనివాస్, హెచ్‌ఈవో లింగమూర్తి తెలిపారు. ఆయనవెంట గజ్వేల్ క్లస్టర్ హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ తరితరులున్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ విక్రం →



పునరావాసం కోసం రూ. 12.50లక్షలు ఇవ్వాలి

• ఆర్డీవోకు గుడాటిపల్లి ముంపు బాధితుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గుడాటిపల్లి ముంపు బాధితులు

హుస్నాబాద్: శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్ ముంపు బాధితులకు పునరావాసం కోసం 12.54లక్షలు ఇవ్వాలని గుడాటిపల్లి ముంపు బాధితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో శంకర్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పూర్వపు కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద 06-07-2016లో గెజిట్ ప్రకటించారని ఆప్యాకేజీ సరిపోదని తాము కోర్టులో కేసు వేశామన్నారు. కాగా 18-04-2017న ఒక కుటుంబానికి 8లక్షల రూపాయలు ప్యాకేజీ కింద ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని ఇది కూడా తమకు సమ్మతంగా లేదని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన 30-06-2017న జీవో నెం .120 ప్రకారం ప్రతి నిర్వాసిత కుటుంబానికి పునరావాసం కింద రూ. 7.50లక్షలు, మరియు రూ. 5.04లక్షలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కింద మొత్తం రూ. 12.54లక్షల ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గుడాటిపల్లి భూనిర్వాసితులు బాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, తిరుపతిరెడ్డి, బాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

'ప్రియదర్శిని' మూసివేత?

లాక్ అవుట్ దిశగా పీఎస్ఎంఎల్ కంపెనీ?

2వేల మంది కార్మికులకు ఉపాధి గండం?

నాలుగేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్‌లను ఎగ్గొట్టిన యాజమాన్యం

రోడ్డున పడిన కార్మిక కుటుంబాలు

కిమ్మనని అధికారులు, ప్రజా ప్రతినిధులు

సదాశివ పేట/రూరల్: 30 ఏళ్లుగా సదాశివ పేట ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి కల్పించిన ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్ పరిశ్రమలో ఆకస్మాత్తుగా పనులు నిలిచిపోవడం కార్మికులను ఆందోళనకు గురిచేస్తోంది. పరిశ్రమ యాజమాన్యం ఎలాంటి ప్రకటన చేయకున్నా... మూసివేత దిశగా అడుగులేస్తున్నట్టు తెలుసుకుని గుండెలు బాదుకుంటున్నారు. నాలుగేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్‌ను కూడా ఎగ్గొట్టినట్టు ఆరోపణలున్నాయి. ఈ పరిశ్రమలోనే రాజకీయ ఓనమాలు... దిద్దిన ఎందరో నాయకులు నేడు ఉన్నతమైన స్థానంలో ఉన్నా, పరిశ్రమ విషయమై నోరు మెదపడం లేదు. కార్మికులకు న్యాయం చేయాల్సిన వారు మోహం చాటేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. పెరిగిన ధరల భూములే పరిశ్రమ మూసివేత కారణమనే చర్చ ఇప్పుడు కార్మికులను ఆందోళనకు గురి చేస్తోంది.

వెలుగు వెలిగిన పరిశ్రమ

సదాశివపేట పట్టణ పరిధిలో 1983లో ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్ (పత్తి పరిశ్రమ) ఏర్పాటైంది. దశాబ్దాలుగా ఓ వెలుగు వెలిగింది. అయితే నాలుగేళ్లుగా పరిశ్రమలో మాత్రం యాజమాన్యం ఉత్పత్తిని క్రమంగా తగ్గిస్తోంది. దీంతో కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖకు సుమారు రూ.3 కోట్ల బకాయిలను కంపెనీ చెల్లించలేదు. దీంతో ఈ నెల 1వ తేదీ నుంచి కంపెనీకి సరఫరాను ఆ శాఖ నిలిపేసింది.

2వేల మంది కార్మికులకు ఉపాధి గండం?

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎంతో పేరు పొందిన ఈ



ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్ బోర్డు

పరిశ్రమలో సుమారు 2వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వారిలో 400 మంది శాశ్వత కార్మికులు, 1600మంది కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వందలాది మంది కార్మికులు 30ఏళ్లుగా ఇక్కడే పని చేస్తూ సదాశివపేట పరిసర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు కంపెనీ మూసివేత దిశగా పయనిస్తుండడంతో వారంతా ఆందోళనకు గురవుతున్నారు. తమ కుటుంబాలను పోషించేదెలా? అంటూ విలపిస్తున్నారు.

నాలుగేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ ఎగవేత?

నాలుగేళ్లుగా పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు పలు అలవెన్స్‌లను చెల్లించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2014 నుంచి పీఎఫ్ డబ్బును దారిమళ్లించి స్వప్రయోజనానికి వాడుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో పెద్ద సంఖ్యలో కార్మికులు వివిధ స్థాయిల్లో న్యాయ పోరాటం చేసున్నట్టు సమాచారం. కొందరు కార్మికులు ఏకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులను కలిసి తమకు న్యాయం చేయాలని కోరినట్టు సమాచారం.

కిమ్మనని కార్మిక శాఖ, ప్రజా ప్రతినిధులు!

కార్మిక చట్టాలను తులనాడి... పరిశ్రమ యాజమాన్యం కోట్లాది రూపాయల కార్మికుల సొమ్మును చెల్లించికపోయినా కార్మిక సంక్షేమ శాఖ, ప్రజా ప్రతినిధులు కిమ్మనకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఎన్నో రాజకీయ పార్టీలకు ఈ పరిశ్రమ యాజమాన్యం కల్పతరువుగా ఉండేది. కొన్నేళ్లుగా సదరు పరిశ్రమ యాజమాన్యం నష్టాలను సాకుగా చూపుతూ, ఉత్పత్తిని తగ్గిస్తూ కార్మికులను ఉపాధికి దూరం చేసింది. అయినా ఏ పార్టీ గానీ, నాయకులుగానీ, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు కార్మికులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలకేం... బోలెడు ఉన్నాయ్

కార్మికుల సంక్షేమం వెల్లివిరిసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు చాలా ఉన్నాయి. పారిశ్రామిక వివాదాల చట్టం 1947, కార్మిక సంఘాల చట్టం 1926, వేతనాల చెల్లింపు చట్టం 1936, కనీస వేతనాల చట్టం 1948, సమాన ప్రతిఫల చట్టం, బోనస్ చెల్లింపు చట్టం 1965, గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972, ఫ్యాక్టరీల చట్టం 1948, ఉద్యోగ నష్టపరిహార చట్టం, ఈఎస్ఐ చట్టం 1948, కార్మిక భవిష్యనిధి చట్టం 1952, ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961, బాలకార్మిక నిషేధ చట్టం 1986, కాంట్రాక్టు కార్మిక చట్టం 1970 ఎన్నో ఉన్నా అవి పూర్తి స్థాయిలో కార్మికులకు దోహదం చేస్తున్నాయా? అంటే ఆ సంగతి సంబంధిత కార్మిక శాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. కానీ తమ బతుకులను మాత్రం ఆ చట్టాలు మార్చడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, కార్మిక సంఘాలు తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అప్పులు భారమయ్యాయి



26ఏళ్లుగా ఇదే కంపెనీలో పనిచేస్తున్నాను. ఇన్నాళ్లు జీతంతో కుటుంబం గడిచేది. కంపెనీ మూత పడుతున్నట్టు తెలిసింది. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు, వైద్యానికి మొత్తంలో అప్పులు చేశా. వాటిని ఎలా తీర్చాలో...

-పర్మినెంట్ కార్మికురాలు అనసూయ, కోనాపూర్

నాకు ఎలాంటి నోటీసు రాలేదు



18ఏళ్లుగా పరిశ్రమలో పనిచేస్తున్నా. ఆకస్మాత్తుగా పనులు నిలిపేశారు. పని లేకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. మూసివేతపై ఇప్పటివరకు పరిశ్రమ నుంచి నాకు ఎలాంటి నోటీసు అందలేదు.

-వీరశెట్టి, పర్మినెంట్ కార్మికుడు, చేవెళ్ల

వయసైపోయింది



28 ఏళ్లుగా పరిశ్రమలో పనిచేస్తున్నాను. కుటుంబంతో సహా ఇక్కడే స్థిరపడ్డాను. ఇప్పుడు కంపెనీలో పనిలేకుండా పోయింది. వేరే పని చేయడం రాదు. గత్యంతరం లేక వెళ్దామనుకున్నా వయోభారం అడ్డుపడుతున్నది.

-క్రిష్ణమూర్తి, పర్మినెంట్ కార్మికుడు, విజయవాడ

కిరాయిలు ఇబ్బందిగా మారాయి



22 ఏళ్లుగా ఈ పరిశ్రమలోనే పనిచేస్తున్నాను. నెలకు వచ్చే రూ.6500తో అష్టకష్టాలతో బతుకు బండిని లాగుతున్నాను. పరిశ్రమ మూసేయడంతో మరింత భారమయింది. కనీసం ఇంటి అద్దెను ఇవ్వడం కష్టంగా మారింది.

-పుష్పలత, పర్మినెంట్ కార్మికురాలు, మోర్గే


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు

రూ.3.65కోట్లతో అర్‌అండ్‌బీ భవనం

● మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్: అత్యాధునిక వసతులతో జిల్లా రహదారులు, భవనాల శాఖ కార్యాలయ భవనం నిర్మిస్తున్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేద్రంగా ఏర్పాటు కావడంతో అనేక అభివృద్ధి పనులు చెపట్టినట్లు మంత్రి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణం హౌసింగ్ బోర్డు కాలని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వెనక భాగంలో అర్ అండ్ బీ కార్యాలయ భవనం నిర్మించేందుకు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజచేశారు. నూతనంగా నిర్మించే జిల్లా స్థాయి భవన నిర్మాణానికి రూ. 3.65కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని హంస వారి రెడ్డి మెస్‌ను ప్రారంభించారు. మంత్రి నివాసం సమీపంలోని సూర్య హాస్పిటల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అంచనాల దుబ్బాక ఎమ్మెల్యే సొలిపేట రామలింగారెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, అర్ అండ్ బీ జిల్లా అధికారి బాల్‌నర్సయ్య, మున్సిపాల్ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ అత్తర్ పటేల్, కౌన్సిలర్లు రవీందర్, మల్లికార్జున్, నాయకులు సంపత్‌రెడ్డి, రాంచంద్రం, వెంకటస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు చెక్కుల పంపిణి


భూ నిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్ కుడికాలువ సిద్దిపేట మండలం వెల్కటూరు గ్రామ భూ నిర్వాసితులకు శుక్రవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో నష్టపరిహారం చెక్కులను మంత్రి హరీశ్‌రావు అందజేశారు. వెల్కటూరుకు చెందిన 36 మంది రైతులు సుమారు 29 ఎకరాల భూమిని కోల్పోయినందుకు వారికి రూ.2.25 కోట్ల చెక్కులు అందజేసినట్లు మంత్రి తెలిపారు. రెండు మూడు రోజుల్లో కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల భూనిర్వాసితులకు కూడా నష్టపరిహారం అందజేస్తామన్నారు. కాళ్లకుంటకాలనీలో గతంలో మిషన్ భగీరథ కోసం తీసిన గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందగా వారి కుటుంబీకులకు హరీశ్‌రావు రూ.2 లక్షల చెక్కు అందజేశారు.

ఆలయాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ

● పట్టణంలోని అన్ని ఆలయాలను అబివృద్ధి చేస్తాం

● రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్: ఆలయాల అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నదని రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక శివాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మేళవాయిద్యాలతో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంలింగారెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. హరీశ్‌రావు గడ్డపారతో తవ్వారు. ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి పారతో మట్టిని తీసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 32 లక్షలతో శివాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణంలోని ఆలయాలన్నింటినీ కొక్కక్కటిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆలయాల అభివృద్ధి ప్రక్రియను ఒక స్ఫూర్తిగా తీసుకుంటామన్నారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ నిర్వాహకులు, పూజారులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్, నాయకులు రామన్న, గుడాల శ్రీకాంత్, కూర పండరినాథ్, సాకి ఆనంద్, శేషకుమార్, నాయకం వెంకటేశ్, శ్రీనివాస్ , రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను మించి వైద్యమందిస్తాం

● మొదటి డయాలసిస్ కేంద్రం సిద్దిపేటలోనే

● హరీశ్ సాధించేవరకు వదలడు

● దేశంలోనే మొదటి సారిగా సింగిల్ యూసేజ్ ఫిల్టర్ ఏర్పాటు

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి

● పదిహేడేళ్ల నుంచి బాధపడుతున్న సుష్మా లాంటి వారి కోసమే ఈ కేంద్రం

● నెల రోజుల్లో 300 పడకల ఆస్పత్రిని ప్రారంభించుకుందాం

● కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచిత బస్‌పాస్‌లు

● భారీ నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్: సీఎం కేసీఆర్ సూచన మేరకు ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్‌ను మించి వైద్యం అందిస్తున్నామని, రాష్ట్రంలోనే మొదటిసారిగా డయాలసిస్ కేంద్రాన్ని సిద్దిపేటలోనే ప్రారంభించుకున్నందుకు సంతోషంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని ప్రభుత్వాస్పత్రిలో ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని మంత్రులు లక్ష్మారెడ్డి, హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ హరీశ్‌రావు పట్టుదల కలిగిన వ్యక్తి అని సాధించేవరకు వదిలిపెట్టడని కొనియాడారు. రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టినా మొదటగా సిద్దిపేటలో ప్రారంభించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశంలోనే మొదటిసారిగా డయాలసిస్ కోసం సింగిల్ యూసెజ్ ఫిల్టర్‌ను ఉపయోగిస్తున్న రాష్ట్రం తెలంగాణనే అని లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో మల్టీ యూసెజ్ ఫిల్టర్ ఉండేదని దానిని ఉపయోగించడం వల్ల రక్తశుద్ధి సరిగా జరిగేది కాదన్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో ఐసీయూ కూడా ఉండేదని కాదని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐసీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పేదల ఆరోగ్య సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. చిన్న చిన్న కారణాలతో మహిళల గర్భసంచి తీసేస్తున్నారని, ప్రతి జబ్బు కు వైద్యముంటుందని ఆయన వివరించారు. సాధ్యమైనంత వరకు పేయిన్ కిల్లర్ మందులను వాడొద్దని, కిడ్నీ చెడిపోవడానికి ఇది కూడా ఓ కారణమని ఆయన సూచించారు. దీనిపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం త్వరలో హెల్త్‌సర్వే చేపడుతామని మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి, హరీశ్‌రావు

ప్రజలు ప్రైవేటు నుంచి ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారు: మంత్రి హరీశ్‌రావు

అన్ని సౌకర్యాలు కల్పించి నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించడంతో నేడు ప్రజలు ప్రైవేటు నుంచి ప్రభుత్వాస్పత్రులకు వస్తున్నారని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పదిహేడేళ్ల నుంచి సుష్మ అనే యువతి కిడ్నీలు చెడిపోయి ఆర్థికంగా కుంగిపోయి డయాలసిస్ చేయించుకోవడానికి ఇబ్బంది పడుతున్న సంగతి తన దృష్టికి రావడంతో హైదరాబాద్‌లో డయాలసిస్ చేయిస్తున్నాని ఆయన తెలిపారు. అలాంటి సుష్మలు ఎంతోమంది ఉన్నారని వారందరి కోసమే ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. మొదటగా 5 బెడ్లతో ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ కేంద్రంలో వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. నెల రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 40 డయాలసిస్ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగుల కష్టాలు గమనించిన సీఎం కేసీఆర్ 40 ఉచిత డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించేందుకు నిర్ణయించారన్నారు. నాడు గాంధీ ఆస్పత్రిలో మాత్రమే డయాలసిస్ కేంద్రం ఉండేదని, నేడు జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోపోవడంతోనే ఆస్పత్రుల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ కన్నా మెరుగైనా సేవలందించడం వల్లనే ప్రజలు వైద్యం చేయించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కేంద్రంలో ఏర్పాటు చేసిన మిషన్లు నాసిరకం కాదని, నాణ్యమైనవన్నారు. ఫిల్టర్లను జర్మని నుంచి, మిషన్లను జపాన్ నుంచి తెప్పించామన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రులను మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉండడం వల్లనే అప్పుడే పుట్టిన శిశువులను ప్రభుత్వాస్పత్రుల్లోని ఫోటో థెరపీలో చికిత్స అందిస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాల వల్ల లబ్ధిపొందిన వారు ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకే రావాలని ఆయన కోరారు. నెల రోజుల్లో సిద్దిపేటలో 300 పడకల భవనాన్ని నిర్వహిస్తున్నామని, 23 రకాల డిపార్ట్‌మెంట్‌లతో వంద మందికి పైగా వైద్యులను నియమించామని, సేవలను రోగులు, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. 80 శాతం వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు త్వరలోనే ఉచిత బస్‌పాస్‌లు అందిస్తామని ఆయన తెలిపారు. అంతకుముందు మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుసేన్, జేసీ పద్మాకర్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, జర్మనీ కంపెనీ, డీమెడ్ హెల్త్‌కేర్ ప్రతినిధులు లియాజ్‌ఖాన్, హకీబ్ డీఎం అండ్ హెచ్‌వో ప్రవీణ్‌చందర్, సూపరింటెండెంట్ నర్సింహం, జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, కౌన్సిలర్లు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


హరీశ్‌రావుతో మాట్లాడుతున్న వ్యాధిగ్రస్థులు


పరికరాలను పరిశీలిస్తున్న మంత్రులు


నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి

చెక్కులు పంపిణి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కోసం ఏ ఒక్కరికీ లంచం ఇవ్వొవద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో 82 మంది లబ్ధిదారులకు రూ. 55.56 లక్షల చెక్కులను అందించారు.

సిద్దిపేట నుంచి బెంగుళూరుకు 'రాజధాని' బస్సు

● ప్రారంభించిన రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సిద్దిపేట ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నట్లు రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రజల సౌకర్యార్థం సిద్దిపేట నుంచి బెంగుళూరు వరకు బస్సు సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్‌లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంలింగారెడ్డితో కలిసి జెండాను ఊపి నూతన బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిద్దిపేటను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. మంత్రి బస్సులో ఆర్టీసీ డిపో మేనేజరుతో కలిసి టిక్కెట్టు తీసుకుని కొంతదూరం ప్రయాణం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు సాకి ఆనంద్, గుడాల శ్రీకాంత్, రామన్న, శేషకుమార్, శేఖర్‌గౌడ్, లింగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సినిమాలు

సిద్దిపేట	
బాలాజీ	లై
సీతారామాంజనేయ	ఫిదా
శ్రీనివాస	జయ జానకి నాయక
వెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి

దుబ్బాక	
శ్రీనివాస	జయ జానకి నాయక
చేర్యాల	
బాలాజీ	లై



సర్వాయి పాపన్న సేవలు మరువలేనివి

• సర్పంచుల ఫోరం మిరుదొడ్డి అధ్యక్షుడు లింగంగౌడ్


పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిరుదొడ్డి: తెలంగాణ ఉద్యమంలో సర్దార్ సర్వాయి పాపన్న సేవలు మరువలేనివని మిరుదొడ్డి సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బుర్ర లింగం గౌడ్ అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలోని కల్లుడిపోలో పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మొట్టమొదటి వ్యక్తి పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వెంకట్‌గౌడ్, పర్శాగౌడ్, నారాగౌడ్, యాదగౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చేర్యాలలో

చేర్యాల టౌన్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 367వ జయంతిని శుక్రవారం చేర్యాలలో గౌడ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు అంబటి సిద్దయ్య పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపన్న సేవలను వారు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అంబాల వెంకటేశ్, బూరుగు కనకయ్య, బూరుగు సత్యనారాయణ, గట్టు రామచంద్రం, ముసిని వేణుగోపాల్, నరిగె బాలభాస్కర్, తాళ్లపల్లి రాజు, బత్తిని శ్రీను, బైర గోని హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై మండల సభ ఆగ్రహం


సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

దుబ్బాక: మండల పరిషత్ అధ్యక్షురాలు ర్యాకం పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం దుబ్బాకలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి సకాలంలో అధికారులు రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పడకల గదుల నిర్మాణం సకాలంలో సాగుతున్నాయని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల్లో స్థల సేకరణకు అవాంతరాలుంటే పరిష్కరిస్తున్నామన్నారు. ఏఎంసీ చైర్మెన్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ, మొక్కల పెంపకంలో దుబ్బాక ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ అరుణ, ఆత్మకమిటీ చైర్మెన్ సంజీవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'


తహసీల్దారుకు వినతిపత్రాన్నిస్తున్న సీపీఎం నాయకులు

దుబ్బాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం తహసీల్దారు అరుణకు వినతిపత్రాన్ని సమర్పించారు. అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పిన బీజేపీ ఇప్పుడు ఏ ఒక్క నోటిఫికేషన్‌ను కూడా ప్రకటించలేదన్నారు. లక్ష ఉద్యోగాలు కల్పిస్తామన్న మాటను సీఎం కేసీఆర్ మరిచిపోయారన్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణకే అమలు చేయాలన్నారు. ఆయనవెంట నాయకులు ప్రశాంత్, మనోహర్, సాధిక్, శేఖర్, స్వామి, కిషన్ చందు రమేష్ తదితరులున్నారు.

భువనేశ్వరి మందిరంలో భక్త జన సందోహం

చేర్యాల: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని చేర్యాల మండలం చుంచనకోట నారసింహా గురుస్తానం భువనేశ్వరి ఆలయాన్ని శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థుల సౌలభ్యం కోసమే కస్తూర్బా పాఠశాలలు

• రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి


దుప్పట్లు, జమకానాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తొగుట: పేద విద్యార్థుల సౌలభ్యం కోసమే కస్తూరీబా పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం తొగుట కస్తూరీబా పాఠశాలలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నారా?, వసతులెలా ఉన్నాయన్న వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గత పాలకులు స్వలాభం కోసమే తప్ప విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కస్తూరీబా పాఠశాల నూతన భవనానికి రూ.2కోట్ల 83 లక్షలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే నూతన భవన నిర్మాణం చేపడుతామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని లేని పక్షంలో కాంట్రాక్టర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కాగా, 7వ తరగతిలో 16 మంది విద్యార్థులే ఉండడంతో 40 మంది విద్యార్థులు ఉండేటట్లు చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, జమకానాలు అందజేశారు.

కాశ తుర్కలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

తుక్కాపూర్ గ్రామంలోని కాశ తుర్కలకు 2018 దసరాలోగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. శుక్రవారం కాశ గుడిసెలలో ఆయన పర్యటించి వారితో మాట్లాడారు. కాశ గుడిసెలను తొలగించి వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అంతవరకు మరొక చోట తాత్కాలికంగా గుడిసెలను ఏర్పాటు చేసుకోవాలని కాశ తుర్కలకు సూచించారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీడీవో రాజిరెడ్డి, తహసీల్దారు శ్రీనివాసరావు తదితరులున్నారు.

బీడీ కార్మికులకు జీవన భృతిని చెల్లించాలి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాస్కర్


సిబ్బందికి వినతిపత్రాన్నిస్తున్న నాయకులు

దుబ్బాక: అర్హులైన బీడీ కార్మికులకు 1000 రూపాయాల జీవన భృతిని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం దుబ్బాకలో నగరపంచాయతీ సిబ్బందికి వినతిపత్రాన్ని సమర్పించారు. పీఎఫ్ నంబర్ కలిగిన బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతిని చెల్లించాలన్నారు. స్థానిక దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ బీడీ సెంటర్‌లో ముప్పై సంవత్సరాలుగా బీడీ ప్యాకర్లుగా పనిచేస్తున్న కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతిని చెల్లించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయనవెంట బీడీ కార్మికులు శ్రీనివాస్, రాజు, కిషన్, రమేష్, శ్రీనివాస్, ఎలెందర్, ఆంజనేయులు, బాలకృష్ణ, మహేష్ తదితరులున్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి వంట చెరుకు, కూరగాయల సరఫరాకు శుక్రవారం ఆలయ ఈవో రామకృష్ణారావు ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించారు. వంట చెరుకు సరఫరా విభాగంలో క్వింటాలుకు రూ.300చొప్పున కోట్ చేయగా, దుద్దెడకు చెందిన ఎల్లయ్యకు వేలం ఖరారు చేశారు. కూరగాయల విభాగంలో ఎవరూ రాకపోవడంతో వేలం పాట వాయిదా వేశారు. షాపింగ్ కాంప్లెక్సు లీజు విభాగంలో ఒక షాపు వేలం ఖరారు చేశారు. వేలం పాటలో ఆలయ సూపరింటెండెంట్‌లు రావుల సుదర్శనం, నీల శేఖర్, బత్తిని పోచయ్య, నర్సింహులు, మ్యా కల పోచయ్య పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ



శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య

చేర్యాల: పీఆర్టీయూ చేర్యాల మండలాధ్యక్షుడిగా జంగ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెరక రాజయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా పీ.శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలుగా కే. మమత, కార్యదర్శిగా ఆర్.శ్రీని వాస్‌లను జిల్లా నాయకులు కొత్త నరేందర్‌రెడ్డి, కే.రవీందర్ నియమించారు.

వడగండ్ల బాధితులకు పరిహారమివ్వాలి

• బీజేపీ నాయకుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న పచ్చిమడ్ల స్వామి

చేర్యాల: వడగండ్ల కారణంగా గత రబీలో పంటలు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటం తగదని బీజేపీ కొమురవెల్లి మండల కార్యదర్శి నర్సింహులు, బీజేవైఎం మండలాధ్యక్షుడు స్వామి విమర్శించారు. శుక్రవారం కొమురవెల్లి మండలం అయినాపూర్‌లో మండల కమిటీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వడగండ్లతో కొమురవెల్లి, చేర్యాల మండలాల రైతులు వందలాది ఎకరాల్లో పంటలు కోల్పోయారని, వారిని ఆదుకుంటామన్న ప్రభుత్వం ఇప్పుడు పట్టించుకోకపోవడం తగదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిహారం త్వరిత గతిన అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొమురవెల్లి-కొండపోచమ్మ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్, కరుణాకర్, వల్లపు వెంకట్‌రెడ్డి, రాందాస్, రాజు, కిషన్, నర్సింహారెడ్డి, వెంకటేశ్, కిషన్, భరత్, భాస్కర్, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ

మిరుదొడ్డి: మిరుదొడ్డి మండలం భూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ కన్వీనర్‌గా మధు, కో-కన్వీనర్లుగా నర్సింలు, రాకేష్‌తోపాటు పది సభ్యులను శుక్రవారం ఎన్నుకున్నారు.

పారిశుధ్య పనుల్లో మిరుదొడ్డి సర్పంచ్ విఫలం

• టీఆర్ఎస్ నాయకులు


బొమ్మెర్ల చెరువు వద్ద చెత్తను తొలగిస్తున్న టీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి: మిరుదొడ్డిలో పారిశుధ్య పనుల్లో సర్పంచ్ పూర్తిగా విఫలమాయ్యరని ఎంపీపీ పంజాల కవిత, వ్యవసాయ మార్కెట కమిటీ చైర్మన్ బాపురెడ్డి విమర్శించారు. శుక్రవారం మిరుదొడ్డిలో బొమ్మెర్ల చెరువు కట్ట వద్ద నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ ద్వారా చెత్తను ఊడ్చివేయాలని చెప్పుతున్నప్పటికీ స్థానిక బీజేపీ సర్పంచ్ చెత్తను డంప్‌యార్డులో వేయకుండా బొమ్మెర్ల చెరువు కట్ట వద్ద వేస్తున్నారని మండిపడ్డారు. దీంతో చెరువుకట్ట వైపు నుంచి వెళ్లేవారికి దుర్వాసన రావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాగా, ఎమ్మెల్యే ఆదేశాలతోనే స్వచ్ఛ భారత్‌ను నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు శివకుమార్, బైరయ్య, స్వామి, కోఆప్షన్‌మెంబర్ హుస్సేన్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, దుర్గారెడ్డి, నరేందర్‌రెడ్డి, స్వామి, వెంకటయ్య, భూపతిగౌడ్, రాములు, నర్సింలు, లింగం, శ్రీనివాస్, మల్లయ్య, సత్యనారాయణ, సంజీవరెడ్డి, రమేష్, రాధకిషన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చాలి

● గ్రామీణ డాక్ సేవకులు


డీఆర్వోకు వినతి పత్రాన్నిస్తున్న డాక్ సేవకులు

సిద్దిపేట రూరల్: తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్‌చేస్తూ ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్వో చంద్రశేఖర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, జీడీఎస్‌లకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలన్నారు. ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో సహా జీడీఎస్ కమిటీ రిపోర్టులను అమలు చేసి, జీడీఎస్‌లకు 8 గంటలకు పనిని కుదించాలని కోరారు. ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపాల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్‌లకు పింఛన్ మంజూరు చేయాలన్నారు. టార్గేట్‌ల పేరుతో జీడీఎస్‌లను వేధించటం మానుకోవాలన్న తదితర డిమాండ్‌ల సాధనకు నిరవధిక సమ్మె చేపట్టినట్లు వివరించారు. స్పష్టమయిన హామీ వచ్చేంతవరకు సమ్మె విరమించబోమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గుండుకాడి శంకర్, కోశాధికారి మంద అంజనేయులు, ప్రతినిధులు కే.రామచంద్రం, మనోహర్, చందర్‌రావు, నాంపల్లి తిరుపతిరెడ్డి, ఎల్లయ్య, పాకాల శంకర్, నాగరాజు, మీణ, శ్రీలత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్‌గా యాదగిరి


నియామక పత్రాన్నందుకుంటున్న యాదగిరి

నంగునూరు: సిద్దిపేట జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్‌గా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, నంగునూరు సర్పంచ్ దేవులపల్లి యాదగిరిని నియమిస్తూ తెలంగాణ పంచాయతీ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ లకిడికాపూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ నియామకం జరిగింది.

'తపస్‌'తో సమస్యల పరిష్కారం

నంగునూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పని చేస్తున్నదని తపస్ రాష్ట్ర బాధ్యులు వంగ నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం నంగునూరులో నిర్వహించిన తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కత్తుల రాంరెడ్డి, బొజ్జ అశోక్, మండల బాధ్యులు ముదిగంటి రవీందర్‌రెడ్డి, గాడీల శ్రీకాంత్, వీరేశం, జయపాల్, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి, చంద్రకాంత్, లక్ష్మినర్సయ్య, చంద్రశేఖర్‌శర్మ, వెంకటకృష్ణశర్మ, జనార్దన్‌రెడ్డి, సుకన్య, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం

సిద్దిపేట టౌన్: పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ ప్రధాన కార్యదర్శి హరికిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016-17లో వివిధ స్కూల్ ఇంటర్‌గేమ్స్‌లో అండర్ 14, 17లలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు సన్మానం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 25లోపు క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9948110433, 8328148197 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కార్యాలయంలో సిబ్బంది లేరు'

చిన్నకోడూరు: చిన్నకోడూరు తహసీల్దారు కార్యాలయంలో సరిపడా సిబ్బంది, అధికారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సకాలంలో పనులు పూర్తికాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఉద్యో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన కోరారు. ఆయనవెంట దినేష్‌గౌడ్, ఉపాకిరణ్, యాదగిరి తదితరులున్నారు.

మాంకాళమ్మ బోనాల ఊరేగింపు

నంగునూరు: ఏటా శ్రావణ మాసం చివరి వారంలో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నంగునూరు మండలం నర్మెటలో మాంకాళమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సర్పంచ్ గాలవ్వ అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఉత్సవంలో అన్ని కుల సంఘాలు పాల్గొన్నాయి.

'ఐకేపీ' సిబ్బందికి ఉద్యోగ భద్రత కావాలి

● మండల అకౌంటెంట్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగుల సంక్షేమ సంఘం


కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న ఐకేపీ సిబ్బంది

సిద్దిపేట రూరల్: ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న ఆఫీసు సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని మండల అకౌంటెంట్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగుల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు జ్యోతి కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈ విషయమై నిరవధిక సమ్మె చేపట్టారు. సంఘం నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, అటెండర్, వాచ్‌మెన్లుగా చేస్తున్న సిబ్బందిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, సెర్ప్ హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని, రూ.18,500, అటెండర్లకు రూ.10500 కనీస వేతనం ఇవ్వాలని, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. శ్రీనిధి ద్వారా వచ్చే లాభాల్లో తమకు కూడా వాటా వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బాస్కర్, కోశాధికారి బాలనారాయణ, సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో రోజు మీజిల్స్, రుబెల్లా కార్యక్రమం


నంగునూరు శాంతినికేతన్ స్కూల్‌లో విద్యార్థినికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేట రూరల్: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందించేందుకు ఎంఆర్ వ్యాక్సిన్ దోహదపడుతుందని పుల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంపత్ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని 5 సబ్ సెంటర్లలో 823 మంది పిల్లలకు రెండోరోజు ఎంఆర్ వ్యాక్సిన్‌ను అందించారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుందని ఆయన తెలిపారు. నారాయణరావు పేట పీహెచ్‌సీ పరిధిలోని 7 సబ్ సెంటర్లలో రెండో రోజు ఎంఆర్ వ్యాక్సినేషన్ కొనసాగింది.

నంగునూరులో

నంగునూరు: మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం రెండో రోజైన శుక్రవారం నంగునూరులో కొనసాగింది. మండలంలో 708మంది పిల్లలకు టీకాలు చేశారు. పాఠశాలల వారిగా చేపడుతున్న కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తున్నదని హెచ్ఈవో శ్రీనివాస్‌రెడ్డి, పీహెచ్ఎన్ సుందరి తెలిపారు.

సిద్దిపేటలో వర్షం




సిద్దిపేట పట్టణంలో వర్షం కురుస్తుండటంతో కవర్లు కప్పుకొని వెళ్తున్న తల్లీకొడుకులు, ప్రయాణీకులు

నిరుద్యోగులకు 'జాగృతి' జాబ్ మేళా

సిద్దిపేట రూరల్: నిరుద్యోగులకు ప్రధాన మంత్రి కౌశల్ రోజ్ గార్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జాగృతి జిల్లా కన్వీనర్ ఎజాస్ అహ్మద్ శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ నెల 22న ఉదయం 9:30 నిమిషాల నుంచి సాయంత్రం 5:30 వరకు స్థానిక శివమ్స్‌గార్డెన్‌లో నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. సేల్స్‌మెన్స్, బ్రాండ్ ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అకౌంట్స్, ఫైనాన్స్, కస్టమర్ సర్వీస్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ సేల్స్ కో ఆర్డినేటర్లల్లో లైఫ్‌స్టైల్, అనూస్, బిగ్ బజార్, స్పెన్సర్స్, రిలయన్స్ అరబిందో, ఎమెజాన్, మెట్రో, అపోలో ఫార్మసీ, మాక్స్‌లాంటి 25 కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు రెజ్యూమ్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని సూచించారు. వివరాలకు 08457-23123, 9701809778, 9912937873, 7075707469 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో జాగృతి స్కిల్స్ కో ఆర్డినేటర్ కొండూరి పవన్‌కుమార్, అధికార ప్రతినిధి కసిరెడ్డి సురేశ్‌రెడ్డి, జయపాల్, చింతమడక చందు, ప్రభుదాస్, హరినాథ్, నాగరాజ్, రాంగోపాల్, శాస్త్రి, కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

సిద్దిపేట రూరల్: సిద్దిపేట మండలం తడ్కపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2017-18 విద్యా సంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గన్నె రాజిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 4 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదోతరగతికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభ్యర్థులు రూ.600, ఓసీ అభ్యర్థులు రూ.1000, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. ఇంటర్‌లో చేరే ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు రూ. 800, ఓసీలు రూ.1100, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లించాలన్నారు. వివరాలకు తడ్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

సర్దార్ సర్వాయ్ పాపన్న జయంతి వేడుకలు


పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేట రూరల్: సర్దార్ సర్వాయ్ పాపన్న ఆశయాలను కొనసాగించాలని సిద్దిపేట ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు మారెడ్డి రవీందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సిద్దిపేట మండలం ఇర్కోడ్ గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యుదయానికి కృషి చేసిన ఘనత పాపన్నదేనని కొనియాడారు. కార్యక్రమంలో సిద్దిపేట పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్‌రెడ్డి, మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లింగారెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించిన వాహనదారులపై కేసు


వాహనదారుడిని బ్రీత్‌అనలైజర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

సిద్దిపేట క్రైం: సిద్దిపేట కొత్త బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీ నిర్వహించారు. బ్రీత్‌అనలైజర్‌తో టెస్ట్ చేయగా ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతునట్లు రుజువు కావడంతో వారిపై కేసు నమోదు చేశారు. వారిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



హుస్నాబాద్‌లో సినిమా
వెంకటేశ్వర
జయ జానకి నాయక

సీపీఎం ఆధ్వర్యంలో మండలసభ ముట్టడి

- ప్రజాప్రతినిధులు, సీపీఎం నాయకుల మధ్య ఘర్షణ
- సర్పంచ్ కాలర్‌పట్టి నెట్టేసిన ప్రజలు
- అర్ధాంతరంగా సమావేశం వాయిదా



మండల సర్వసభ్య సమావేశంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మద్దూరు: అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుకు నిరసనగా సీపీఎం నాయకులు మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ చల్లా లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం జరుగుతున్న సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నాయకులు ధర్నా చేశారు. కార్యాలయం తలుపులు మూసి నిరసన తెలిపారు. పోలీసుల జోక్యంతో తలుపులు తెరిచారు. అనంతరం గంటపాటు నిరసన తెలిపారు. పోలీసులు అడ్డుకోవడంతో వారిని నెట్టుకుంటూ సమావేశ మందిరంలోకి వెళ్లి బైఠాయించారు. దీంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వంగపల్లి, ధర్మారం శివారు పిట్టల కాలనీలో సమస్యలు తాండవ చేస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మారం పిట్టల కాలనీకి విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారని పేర్కొన్నారు. సబ్సిడీ పథకాలు అధికార పార్టీ నాయకులకే అందుతున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారి ప్రజల ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో రమేష్‌కు వినతి పత్రం ఇస్తుండగా ఓ గ్రామ సర్పంచ్ అడ్డు కోవడంతో ఆయన్ను ప్రజలు చొక్కా పట్టుకొని పక్కకు నెట్టేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు బయటకు పంపారు. వైస్ ఎంపీపీ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీలు అయిలయ్య, పర్శరాములు, రాపాక పుష్ప, సర్పంచులు భూపతి, ఆనందం, రజిత పోలీ సులకు ఫిర్యాదు చేశారు. వివిధ కారణాల వల్ల మండల సర్వసభ్య సమావేశాన్ని ఐదు సార్లు వాయిదా వేయడంపై ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేశారు. సీపీఎం నాయకుల ముట్టడితో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. రెండు నెలల క్రితం చనిపోయిన సర్పంచ్ నాగవత్ కిషన్ నాయక్ ఆత్మశాంతి కోసం సభ్యులు రెండు నిముషాలు మౌనం పాటించారు.

22నుంచి పాఠశాల స్థాయి క్రీడా ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల క్రీడా సమాఖ్య నాయకులు

హుస్నాబాద్: ఈనెల 22వ తేదీ నుంచి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్ఎం మనీల తెలిపారు. శుక్రవారం పాఠశాలల హెచ్ఎంలు, పీఈటీల సమావేశం నిర్వహించారు. 22వ తేదీ కబడ్డీ, 23న ఖోఖో, 24న వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని, అండర్ -14, అండర్ -17 బాలబాలికలకు ఈ పోటీలు ఉంటాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే పాఠశాలల విద్యార్థులు 21వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్ఎం రవీందర్, పీడీ వెంకట్‌రెడ్డి, పీఈటీలు శ్రీధర్, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, భాగ్య, కళావతి, రాజిరెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట మండలంలో...

అక్కన్నపేట: ఈ నెల 22వ తేదీ నుంచి మండలంలో ప్రభుత్వ పాఠశాల స్థాయి క్రీడా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య నాయకులు వెంకటనర్సయ్య, గంగాధర్ తెలిపారు. శుక్రవారం అక్కన్నపేట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అండర్ 14 -17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు టీంల పేర్లు అందజేయాలని వారు కోరారు. సమావేశంలో హెచ్ఎంలు జైపాల్‌రెడ్డి, చంద్రమౌళి, రంగనాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వందశాతం మరుగుదొడ్లు పూర్తి చేయాలి

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి జిల్లాలో ఆదర్శంగా నిలవాలని ఎంపీపీ భూక్య మంగ, ఎంపీడీవో కొత్త అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మరుగుదొడ్ల నిర్మాణాలు, హరితహారం కార్యక్రమంపై సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ హరితహారంలో అనుకున్న లక్ష్యం పూర్తి చేసేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో వేణుమాధవ్, ఐకేపీ ఏపీఎంలు శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

డీఎస్ఈ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

హుస్నాబాద్ టౌన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం తలపెట్టిన డీఎస్ఈ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. జీవో 342కు విరుద్ధంగా వచ్చిన మెమో 26559ను, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేష్, జంపన్న, సదయ్య, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లిలో సత్యనారాయణ వ్రతాలు

హుస్నాబాద్ రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేత

మద్దూరు: మండలంలోని దూళ్మిట్ట ప్రాథమిక పాఠశాలకు స్కూల్ కమిటీ చైర్మన్ అనంతచారి రూ. 10వేల విలువ చేసే ప్రింటర్ జిరాక్స్ మిషన్‌ను అందజేసినట్లు హెచ్ఎం బాపు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిరాక్స్‌తో విద్యార్థులకు కావాల్సిన ప్రశ్నపత్రాల రూపకల్పన, చిత్రాల తయారీకి ఇబ్బందులు తీరుతాయన్నారు. అనంతరం అనంతచారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్, శిరీష పాల్గొన్నారు.

బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్న

హుస్నాబాద్: సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొంరయ్యగౌడ్, వరప్రసాద్‌గౌడ్, ముత్యయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్, చంద్రమౌళి, బత్తిని రామస్వామిగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్,సత్యంగౌడ్, సంపత్‌గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో...

అక్కన్నపేట: తెలంగాణ ప్రజల బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అంతకపేటలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, క్రాంతి పాల్గొన్నారు.

రూ. 5వేల కోట్లు కేటాయించాలి

కోహెడ: గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం 5వేల కోట్ల రూపాయలు కేటాయించాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం నర్సింహులుగౌడ్ కోరారు. శుక్రవారం కోహెడలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. పర్శరాములుగౌడ్, మొగిళి పాల్గొన్నారు.

శనిగరంలో...

మండలంలోని శనిగరం గ్రామంలో సర్దార్ సర్వాయి



కోహెడలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లింగయ్యగౌడ్, ప్రశాంత్, యాదగిరి, నరేష్, రాజు పాల్గొన్నారు.

బెజ్జంకిలో...

బెజ్జంకి: అణగారిన కులాలు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న పోరాటాలు చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని గౌడ సంఘం నాయకులు అన్నారు. అనంతరం నర్మద ఫంక్షన్ హల్‌లో సమావేశం నిర్వహించారు.

మద్దూరు మండలంలో ...

మద్దూరు: మండలంలోని దూళ్మిట్ట, అర్జున్‌పట్ల గ్రామాల్లో శుక్రవారం సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్జున్‌పట్ల సర్పంచ్ నర్సింహులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపం: భాస్కర్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

బెజ్జంకి: సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని సీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న శంషాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక ఎమ్మార్సీలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగుల పాలిట పెనుభూతంగా తయారైన సీపీఎస్ విధానాన్ని తరిమికొట్టేందుకు విశ్రమించకుండా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తే రాష్ట్రంలోని లక్షా 19వేల కుటుంబాలు ప్రభుత్వానికి వెన్నంటి ఉంటాయన్నారు. శంషాబాద్‌లో తలపెట్టిన సమర శంఖం భారీ బహిరంగ సభకు వేలాదిగా ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు అయిలయ్య, కార్యదర్శి నాగభూషణం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కోహెడ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం కోహెడ పాఠశాలలో పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసే వరకు తమ సంఘం పోరాడుతూనే ఉంటుందన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడే కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ సెలవులు ఇప్పించడంలో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, నారాయణ, మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, కిషన్‌నాయక్, బాల్‌రెడ్డి, రమేష్, అరుణ, అనిత, కొంరయ్య, రాములు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మండలం కార్యవర్గం ఎన్నిక

పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా మల్లారెడ్డి, ఓదెలు కుమార్ వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా రామనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, కార్యదర్శిగా బాబు ఎన్నికయ్యారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోహెడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఏర్పాటు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ ఉప్పులస్వామి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నట్లు ఇన్‌స్ట్రక్టర్ సునిత తెలిపారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గజ్వేల్‌లో సినిమాలు

సంతోష్	పిదా
యాదగిరి	నేనే రాజు నేనే మంత్రి
తూప్రాన్	
వెంకటేశ్వర	జయ జానకి నాయక

ఎంపీపీ మాట తప్పాడని మండల సభ బహిష్కరణ

- రాజీనామా చేసే వరకు సభ జరగనివ్వం
- తేల్చి చెప్పిన ఎంపీటీసీ సభ్యులు


సభ నుబహిష్కరించి నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

జగదేవ్‌పూర్: ఎంపీపీ రేణుక మాట తప్పినందుకు నిరసనగా మండలసభ బహిష్కరిస్తున్నట్లు జగదేవ్‌పూర్ ఎంపీటీసీలు ప్రకటించారు. శుక్రవారం ఎంపీపీ ఎర్ర రేణుక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభం కాగానే పలువురు ఎంపీటీసీలు సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎంపీపీ రేణుక బాధ్యతలు తీసుకున్న రెండున్నర సంవత్సరాలకు రాజీనామా చేయాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటి వరకు రాజీనామా చేయడం లేదని ఆరోపించారు. రేణుక తన పదవికి రాజీనామా చేస్తే తీగుల్ నర్సాపూర్ ఎంపీటీసీ శకుంతల ఎంపీపీగా ఎన్నికవుతారని, ఇలా టీఆర్ఎస్ పెద్దల ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ ఒప్పందాన్ని రేణుక ఉల్లం ఘిస్తున్నారని ఆరోపించారు. రాజీనామా చేయాలని ఎన్నిసార్లు కోరినా మొండి వైఖరి అవలంబిస్తోందని, అందుకే గతంలో జరిగిన మండల సభను బహిష్కరించామని, అయినా మార్పు రాకపోవడంతో ఈ రోజు కూడా సభను బహిష్కరిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. ఎంపీపీ రాజీనామా చేసే దాకా సమావేశాలు జరగనివ్వమని ప్రకటించారు. ఎంపీటీసీలు శకుంతల, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్య, బాలేషంగౌడ్, భాగ్యమ్మ, మమతభాను, కోటయ్య పాల్గొన్నారు.

మాట నిలుపుకుంటే రాజీనామాకు సిద్ధమే

ఎంపీపీ ఎన్నిక సందర్భంగా తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటే రాజీనామాకు తాను సిద్ధమేనని ఎంపీపీ రేణుకయాదగిరి పేర్కొన్నారు. ఎంపీటీసీలు సభ బహిష్కరించిన అనంతరం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ ఎన్నిక సందర్భంగా చేసుకున్న ఒప్పందం మాట్లాడుతున్నారే తప్ప తనకు ఇచ్చిన మాటను ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. రెండున్నర సంవత్సరాలు పూర్తి కాగానే తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తా నన్నారని, ఇప్పటికైనా మాట నిలుపుకుంటే రాజీనామా చేస్తానని తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు అండగా నిలుస్తాం

గజ్వేల్ అర్బన్: గ్రామీణ క్రీడాకారులకు అండగా ఉంటామని లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడు మధు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి జిల్లాకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పరమేశ్వరాచారి, సెయింట్ మేరీస్ కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, సిబ్బంది విజయభాస్కర్, గోలి సంతోష్‌కుమార్, సంతోష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లుగా దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్ అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సివిక్స్ సబ్జెక్టు బోధించడానికి అర్హులైన వారు గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల వారు ఈ నెల 21వ తేదీ ఉదయం 11గంటలకు పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపి తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు గడవు ఉన్నట్లు ఆయన తెలిపారు.

స్కూల్‌లో ప్రవేశానికి...

కొండపాక: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వన్సీసా తెలిపారు. 6వ తరగతిలో ఏడు సీట్లు, 7వ తరగతిలో 12, 9వ తరగతిలో 3, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 19, బైపీసీలో 18, సీఈసీలో 9, ఎంఈసీలో 36,సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

23నుంచి మండల స్థాయి క్రీడోత్సవాలు

జగదేవ్‌పూర్: ఈ నెల 23నుంచి మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, పీఈటీ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఎస్‌జీఎఫ్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గొల్లపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు క్రీడోత్సవాలు నిర్వహిస్తామన్నారు. 23న బాలికలు, 24న బాలురకు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హరితహారంలో భాగస్వాములవ్వాలి

గజ్వేల్ అర్బన్/రాయపోల్: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని దౌల్తాబాద్ ఏఎంసీ చైర్‌పర్సన్ రణం జ్యోతి, ఎంపీపీ మంగమ్మ పిలుపునిచ్చారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి, రామారం గ్రామాల్లో హరితహారంలో భాగంగా శుక్రవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

డిటెన్షన్ విధానంతో విద్యార్థులపై ఒత్తిడి

జగదేవ్‌పూర్: కేంద్ర ప్రభుత్వం 5, 8వ తరగతుల విద్యార్థుల కోసం అమల్లోకి తెచ్చిన డిటెన్షన్ విధానం చిన్నారులతపై ఒత్తిడి పెరిగి వారు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటకిరణ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరంతర మూల్యాంకన విధానానికి డిటెన్షన్ వ్యతిరేకమని, దీంతో విద్యార్థులు పూర్తిగా పాఠశాల విద్యకు దూరమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. నాయకులు రాంచంద్రం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు వర్షం అడ్డంకి

జగదేవ్‌పూర్: మండలంలోని దౌలాపూర్‌లో భూముల రీ సర్వే వర్షం కారణంగా నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో సర్వే చేయడానికి వచ్చిన సిబ్బంది వ్యవసాయ భూముల వద్దకు వెళ్లలేకపోయారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

వాణిజ్యశాస్త్ర విద్యార్థులకు అపార అవకాశాలు

గజ్వేల్ అర్బన్: భవిష్యత్తులో వాణిజ్యశాస్త్ర విద్యా ర్థులకు అపార అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ వేంసాని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం కళాశాలలో జీఎస్టీపై వర్క్‌షాప్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ ఆవశ్యకతను విద్యార్థులకు వాణిజ్య పన్నుల సహాయ అధికారి శ్రీనివాసులు వివరించారు. విద్యార్థులు పలు సందేహాలను లేవనెత్తగా వారికి సమాధానమిచ్చారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

వేడుకగా బొడ్రాయి ప్రతిష్ఠ

- భారీగా తరలివచ్చిన భక్తులు
- గ్రామం చుట్టూ ఊరేగింపు
- నేడు గ్రామదేవతలకు బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్: మండలంలోని తీగుల్‌నర్సాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున పాత బొడ్రాయిని తొలగించి అదే స్థానంలో నూతన బొడ్రాయిని ప్రతిష్ఠించారు. కర్నూల్ జిల్లా వేమన మఠం నుంచి వచ్చిన అయ్యవార్ల సమక్షంలో వేడుకలు సాగాయి. భక్తులు భారీగా తరలివచ్చారు. నవ ధాన్యాలతో పొత్తి పోశారు. మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. శనివారం గ్రామదేవతలకు బోనాలు తీయనున్నారు. ఆదివారం మైసమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తారు. వేడుకల్లో పూజారులు రవిచంద్రశర్మ, చంద్రస్వామి, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ శకుంతల, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, కనకారెడ్డి, దేశాయిరెడ్డి, పెద్ద మల్లయ్య, కనకయ్య, భూపాల్‌గౌడ్, మహిపాల్, స్వామి, మన్నె శ్రీను, హరి పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సులభ్ కాంప్లెక్స్ నిర్మాణంపై ఆగ్రహం

గజ్వేల్ అర్బన్: ఇళ్ల మధ్య సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తే తాము ఇబ్బందులు పడాల్సి ఉంటుందని పట్టణంలోని సంగాపూర్ రోడ్డు సమీప ప్రజలు శుక్రవారం ఆందోళనకు దిగారు. సంగాపూర్ రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పూనుకున్నారు. ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తే దుర్వాసనతోపాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా పనులు చేపడుతుండడంతో అడ్డుకున్నారు. ఈ విషయంపై గడ ప్రత్యేకాధికారి హనుమంతరావు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానికులు హెచ్చరించారు. కార్యక్రమంలో సంగాపూర్ రోడ్డు కాలనీ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో కృష్ణారెడ్డి

ములుగు: జిల్లాలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థుల కు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండలం లోని తున్కిబొల్లారం కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పిల్లలకు నాణ్యమైన భోజనం, అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యాలయాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తాడూరి శ్రీనివాస్‌ను సన్మానించిన గజ్వేల్ కుమ్మరులు

గజ్వేల్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన తాడూరి శ్రీనివాస్‌ను గజ్వేల్ శాలివాహన కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కుమ్మరుల సంఘం అభినందన సభలో ఆయనను సన్మానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాడూరి శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రమేశ్, యాదగిరి, స్వామి, సంతోష్, చంద్రం, కరుణాకర్, చందు, కృష్ణ, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సిబ్బందిని వ్యవసాయ శాఖలో విలీనం చేయొద్దు

కొండపాక: గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బందిని వ్యవసాయ శాఖలో విలీనం చేయవద్దని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దుద్దెడలో విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ శాఖలో కింది స్థాయిలో పనిచేస్తున్న వీఆర్ఏ, వీఆర్‌వోలను వ్యవసాయ శాఖలో విలీనం చేయాలనే ఆనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభు, కిష్టయ్య, నర్సింలు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి చిన్నారులకు అన్నదానం

గజ్వేల్ అర్బన్/గజ్వేల్ టౌన్: పట్టణంలోని 10వ వార్డు దివంగత కౌన్సిలర్ నరేందర్‌రావు జయంతి సందర్భంగా ఆశాజ్యోతి చిన్నారులకు శుక్రవారం అన్నదానం చేశారు. నరేందర్‌రావు సోదరుడు అమరేందర్ రావు, కుమారుడు మణిదీప్‌రావు ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదానం చేసి పండ్లను ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, నాగులు, నర్సింలు, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

మూడో రోజుకు పోస్టల్ ఉద్యోగుల సమ్మె

గజ్వేల్ అర్బన్/మర్కుక్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా గ్రామీణ డాక్ సేవకులు చేపట్టిన నిరవధిక సమ్మె మూడవ రోజు కొనసాగింది. గజ్వేల్, పాములపర్తి, ప్రజ్ఞాపూర్ సబ్ పోస్టాఫీస్ పరిధిలోని బ్రాంచ్ పోస్టాఫీసుల్లో విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో దూర ప్రాంతాలకు చేరే ప్రత్యుత్తరాలు నిలిచిపోయాయి. తమ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కరించేంతవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని జీడీఎస్‌లు తెలిపారు. గజ్వేల్‌లో సబ్ పోస్టాఫీస్ ముందు శుక్రవారం నిర్వహించిన సమ్మెలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, ఈడీడీఏలు, ఈడీఎంసీలు, ఈడీప్యాకర్లు పాల్గొన్నారు. నిరవధిక సమ్మెలో జీడీఎస్‌లు రాంచందర్‌రావు, మల్లేశం, మల్లయ్య, నాగేందర్, రవి, శ్రీనివాస్, లక్ష్మీనర్సయ్య, అఫ్జల్, యాదగిరి, మల్లికార్జున్, నర్సింలు, మల్లయ్య, బుచ్చయ్య, రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాషకు అందని భావం ఫొటో

ఒక ఛాయా చిత్రం కోటి భావాల కదలిక. ఒక అంశంపై వందల పేజీల్లో.. వేల అనుభూతులతో వర్ణించినా కలగని అనుభూతి ఒక ఫొటోతో ఆవిష్కరించవచ్చు. ఫొటోగ్రాఫర్‌కు ఓ మంచి దృశ్యాన్ని క్లిక్‌మన్పిచడంలో కలిగే ఆనందం మరెందులోనూ ఉండదు. అలాంటి జ్ఞాపకాలను పదిలపరిచే ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 'ఫొటో మీది.. వేదిక మనది' అంటూ ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అబ్బురపరిచే, ఔరా అనిపించే ఫొటోలను చాలామంది పంపారు. వాటిలో కొన్ని మీకోసం..





పంపిన వారు : మహిమల భాస్కర్‌రెడ్డి, భారత్‌నగర్, సిద్దిపేట

చిన్నారిలాగానే వికసిస్తోంది ఈ పువ్వు



పంపిన వారు : శ్రీవాత్సవ తిగుళ్ల, చేర్యాల మండలం, సిద్దిపేట జిల్లా

కమ్ముకుంటున్న మబ్బుల చాటున జింక



పంపిన వారు : శ్రీపద్ తిగుళ్ల, తొమ్మిదో తరగతి, చేర్యాల మండలం, సిద్దిపేట జిల్లా


పల్లెలోని పకృతి అందం

గ్రామంలో ఒక రోజు సాయంత్రం...



పంపిన వారు : అనంతవరం సిద్దిరామప్ప, గుండారెడ్డిపల్లి గ్రామం, కోహెడ మండలం, సిద్దిపేట జిల్లా

ఆలయం సూర్య కిరణాల తోరణం





పంపిన వారు : రాజశేఖర్‌రెడ్డి, రామాయంపేట, మెదక్ జిల్లా

నాకిదే డబుల్ బెడ్‌రూం




పంపిన వారు : తాటికొండ సిద్ధు, నార్సింగి

పొంగిపొర్లుతున్న ఆనందం




పంపిన వారు : సంతోష్ కుమార్, దోసపల్లి గ్రామం, మానూర్ మండలం, సంగారెడ్డి జిల్లా

ఆకాశం.. నీరు ఏకమవుతున్నట్టుగా..




రోడ్డుకు పచ్చని పందిరి



పంపిన వారు : భార్గవ్ తిగుళ్ల, నేరేడ్‌మెట్

సంధ్యాసమయాన.. నడిసంద్రంలా




పంపిన వారు : నవీన్‌కుమార్, సిద్దిపేట

అపురూప దృశ్యాల నిత్యాన్వేషి మహేందర్




హుస్నాబాద్ మండలంలోని మడద గ్రామానికి చెందిన గుగ్గిళ్లపు మహేందర్ ఫొటోగ్రఫీలో రాణిస్తున్నాడు. జాతీయ స్థాయి ఛాయా చిత్ర పోటీల్లో బహుమతులు అందుకుంటు ప్రముఖులతో ప్రశంసలు పొందుతున్నాడు. 2011 జనవరిలో ఎకోస్ ఫొటో టూల్స్ వర్క్‌షాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటో వర్క్‌షాపులో పాల్గొని ప్రథమ బహుమతిని అందుకున్నాడు. 2012లో హైదరాబాద్‌లో ఎకోస్ సెకండ్ లెవెల్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు. **- హుస్నాబాద్**

సంధ్యా సమయాన భానుడి నిష్క్రమణ



రేపటి వెలుగు కోసం నేడు మబ్బుల్లోకి వెళ్తున్న సూర్యుడు - వెల్దుర్తి

సాయంకాలం.. పట్టణ చిత్రం



పంపిన వారు : జి. చంద్రశేఖర్, జహీరాబాద్, సంగారెడ్డి జిల్లా

ఎండలోనైనా నా నీడ నా వెంటే




తమ్ముడి కోసం హేమంత్ తీసిన ఫొటో



పంపిన వారు : హేమంత్, గంధారిపల్లి గ్రామం, పాపన్నపేట మండలం, మెదక్ జిల్లా

భానుడి సాక్షిగా చెరువు ఎర్రబడింది



పంపిన వారు : శ్రీరామ్ ప్రశాంత్, గజ్వేల్, సిద్దిపేట జిల్లా


లక్ష దీపాల వెలుగు

లక్షదీపోత్సవం సందర్భంగా..




పంపిన వారు : దిడ్డి రాధాకృష్ణ, మసాయిపేట గ్రామం, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లా

ఊరిలో ఆనాటి జ్ఞాపకం



పంపిన వారు : జలీల్‌రుస్తుం, తడ్కల్ గ్రామం, కంగ్టి మండలం, సంగారెడ్డి

బతుకు చిత్రం



- కొండపాక


బతుకుదెరువు కోసం నెత్తిపై రాళ్లు.. పెట్టుకుని చంకలో పాపను పట్టుకుని వీధుల్లో తిరుగుతున్న మహిళ

అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?

మెంటల్ ఎబిలిటి

(1 - 5): ఒక కోడ్ భాషలో NATIONALను 86523867 గాను, VOLUME ను 937401 గాను రాశారు. ఈ కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

1. 'LIMIT' కు సరైన కోడ్?
ఎ) 27052 బి) 72025 సి) 52702 డి) ఏదీకాదు
2. 'ATTENTION' కు సరైన కోడ్?
ఎ) 655185238 బి) 618555832
సి) 688532551 డి) ఏదీకాదు
3. 'LOVE' కు సరైన కోడ్?
ఎ) 1379 బి) 3179 సి) 7391 డి) ఏదీకాదు
4. 'UNIT' కు సరైన కోడ్?
ఎ) 4825 బి) 2458 సి) 8542 డి) ఏదీకాదు
5. MOVE కు సరైన కోడ్?
ఎ) 0391 బి) 3190 సి) 1903 డి) ఏదీకాదు
6. 4, 22, 108, 430, 1288, -----------
ఎ) 2579 బి) 2574 సి) 2457 డి) 2547
7. 8, 3, 2, 3, 10, -------
ఎ) 56 బి) 64 సి) 49 డి) 96
8. 10, 9, 20, 57, 232, ---------
ఎ) 1155 బి) 1165 సి) 1175 డి) 1150
9. 85, 40, 69, 54, 72, 14, 56, ---------
ఎ) 40 బి) 48 సి) 86 డి) 30
10. 13, 18, 31, 49, 80, -------
ఎ) 192 బి) 129 సి) 921 డి) 219
11. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 12 బి) 13 సి) 15 డి) 10
12. a - c - cb - ab - cab - ba - ca -
ఎ) bacacbc బి) aabbccc
సి) caabbcc డి) ఏదీకాదు
13. a - c - bc - acda - da - ca - cd
ఎ) dbbdbb బి) bddbbb
సి) bbdbbd డి) ఏదీకాదు
14. UZ, OR, IL, EH, -------
ఎ) AF బి) FA సి) EB డి) BE
15. AAZ, BDX, DIT, HPN, ----------
ఎ) PFY బి) YPF సి) PYF డి) FYP
16. క్యాలెండర్: తేదీలు :: నిఘంటువు: -------
ఎ) అర్థాలు బి) పదాలు సి) వాక్యాలు డి) ఏదీకాదు
17. రెస్టారెంట్ : మెనూ :: లైబ్రరి : ---------
ఎ) పుస్తకాలు బి) చదువు సి) కేటలాగ్ డి) ఏదీకాదు

(18 - 20) - భిన్నమైనదాన్ని తెలపండి

18. ఎ) తేయాకు బి) పొగాకు సి) చెరకు డి) జొన్న
19. ఎ) 196 బి) 144 సి) 64 డి) 36
20. ఎ) KBPY బి) NRMJ సి) JDQW డి) HTSG
21. ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అరవింద్ ఇలా అంటున్నాడు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కూతురి భర్త భార్యకు ఏకైక సోదరుడి భార్య భర్త' అయితే అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?
ఎ) సోదరుడు బి) మేనమామ
సి) తండ్రి డి) కుమారుడు
22. పార్కుకి వెళుతున్న వ్యక్తిని చూపిస్తూ అమృత్ ఇలా అంటున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక అల్లుడి భార్య సోదరుని తల్లికి భర్త' అయితే పార్కుకి వెళుతున్న వ్యక్తికి అమృత్ ఏమవుతాడు?
ఎ) మనవడు బి) మేనల్లుడు
సి) కుమారుడు డి) అల్లుడు

(23 - 25): A, B లు సోదరులు. A, C లు వివాహిత జంట. B తల్లి M. C కుమారుడు K. A, B ల సోదరి Q. Z భార్య Q. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.




Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

23. A కి Z ఏమవుతారు?
ఎ) సోదరుడు బి) కుమారుడు
సి) బావ డి) మేనమామ
24. Q కి K ఏమవుతారు?
ఎ) కుమారుడు బి) అల్లుడు
సి) సోదరుడు డి) మేనల్లుడు
25. M కి C ఏమవుతారు?
ఎ) కుమార్తె బి) కోడలు సి) మేనకోడలు డి) వదిన
26. సూర్యోదయం తరవాత వివేక్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలబడ్డాడు. స్తంభం నీడ వివేక్‌కు ఎడమవైపున ఉంది. అయితే వివేక్ ఏ దిశను చూస్తూ నిలబడ్డాడు?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) ఏదీకాదు
27. ఉదయం సూర్యునివైపుగా అచ్యుత్ నడకకు బయలుదేరాడు. కొంత దూరం తరవాత ఎడమవైపునకు తిరిగి నడిచాడు. మరల ఎడమవైపునకు తిరిగి నడుస్తున్నాడు. అయితే అచ్యుత్ చివరగా ఏ దిశలో నడుస్తున్నాడు?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) తూర్పు
28. వినోద్, వివేక్, విక్రమ్, విశాల్ క్యారమ్స్ ఆడుతున్నారు. వినోద్, విక్రమ్‌లు భాగస్వాములు. విక్రమ్ తూర్పునకు ముఖంతో ఉన్నాడు. విశాల్ దక్షిణానికి ముఖంతో ఉన్నాడనుకొంటే పడమరకు ముఖంతో ఉన్న వ్యక్తి?
ఎ) వినోద్ బి) వివేక్ సి) విశాల్ డి) ఎవరూకాదు
29. ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?


5	9	17
32	63	125
86	171	?

ఎ) 346 బి) 348 సి) 341 డి) 382
30. ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి




ఎ) 61 బి) 84 సి) 38 డి) 64

(31-35)



పై రేఖాచిత్రాన్ని ఆధారంగా చేసుకొని కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. గాయకులు, క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) K బి) I సి) E డి) B
32. గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) G బి) D సి) F డి) E
33. క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) L బి) H సి) D డి) K
34. గాయకులైన విద్యార్థులను సూచించే అక్షరం?
ఎ) C బి) A సి) K డి) J
35. కేవలం గాయకులను సూచించే అక్షరం?
ఎ) B బి) D సి) I డి) A
36. P అంటే x. Q అంటే ÷. R అంటే - . S అంటే +. అయితే 4P36Q3R752 విలువను తెలపండి?
ఎ) 48 బి) 43 సి) 52 డి) 54
37. A అంటే +. B అంటే x. C అంటే -. D అంటే ÷ అయితే 40D8A3B7C5 విలువను తెలపండి
ఎ) 21 బి) 26 సి) 24 డి) 23
38.



పై డయాగ్రం ఆధారంగా ఎడమవైపున ఉన్న పాచికకు అడుగు ముఖభాగంలో ఉండే అక్షరం?
ఎ) C బి) A సి) E డి) F
39. FRIENDSHIP పదంలో మొదటి అక్షరం ఆరో స్థానంలోకి, ఆరో అక్షరం మొదటి స్థానంలోకి, రెండో అక్షరం ఏడో స్థానంలోకి, ఏడో అక్షరం రెండో స్థానంలోకి, ఇలా పదంలోని అక్షరాలన్నీ మారాయి. మారిన తరవాత ఏర్పడిన నూతన పదంలో కుడి నుంచి అయిదో అక్షరానికి గల మూడో ఎడమ అక్షరం?
ఎ) H బి) N సి) R డి) F
40. ప్రస్తుతం అనుపమ్ వయసు కంటే అతని తండ్రి వయసు నాలుగు రెట్లు. అయిదేళ్ల తరవాత అతని తండ్రి వయసు అనుపమ్ వయసు కంటే మూడు రెట్లు అయితే ప్రస్తుతం అనుపమ్ తండ్రి వయసు?
ఎ) 40 బి) 30 సి) 35 డి) 45
41. లీపు సంవత్సరంలో జనవరి నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల?
ఎ) మార్చి బి) జూన్ సి) ఏప్రిల్ డి) జూలై
42. పాట్నాకు ప్రతి 80 నిలకు ఒక రైలు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణికుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాత రైలు గం.10.15లకు అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?
ఎ) గం.9.10ని బి) గం.10.20ని
సి) గం.9.30ని డి) ఏదీకాదు
43. కింది సిరీస్‌లో ముందు సరి సంఖ్య ఉండి తరవాత బేసి సంఖ్య గల సరిసంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏదీకాదు
44. ఈ రోజు ఆగస్టు 15 గురువారం. కిందటి ఏడాది లీపు సంవత్సరం అయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) శనివారం డి) ఏదీకాదు

సమాధానాలు

1) బి 2) ఎ 3) సి 4) ఎ 5) ఎ 6) బి 7) సి 8) ఎ 9) డి 10) బి 11) బి 12) ఎ 13) బి 14) ఎ 15) సి 16) బి 17) సి 18) డి 19) సి 20) బి 21) సి 22) ఎ 23) సి 24) డి 25) బి 26) ఎ 27) సి 28) ఎ 29) సి 30) ఎ 31) బి 32) డి 33) ఎ 34) సి 35) డి 36) బి 37) ఎ 38) డి 39) ఎ 40) ఎ 41) సి 42) ఎ 43) సి 44) బి

ఉద్యోగాలు

ఐఆర్‌డీఏఐ

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ)- **అసిస్టెంట్ మేనేజర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 30
విభాగాలవారీ ఖాళీలు: ఆక్చూరియల్ 4, అకౌంట్స్ 4, లీగల్ 2, జనరల్ 20
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు విభాగాన్ని అనుసరించి ఐఏఐ/ ఎసీఏ/ ఐసిడబ్ల్యుఏఐ/ ఎసిఎంఏ/ ఎసిఎస్/ సిఎఫ్ఏ/ ఎల్ఎల్‌బి పూర్తిచేసి ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించకూడదు
ఎంపిక: ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, ఫేజ్ 2 - డిస్క్రిప్టివ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా
ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్: అక్టోబరు 4న
ఫేజ్ 1 ఎగ్జామ్ సెంటర్లు: విజయవాడ, హైదరాబాద్
ఫేజ్ 2 ఎగ్జామ్ సెంటర్లు: హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, న్యూఢిల్లీ
దరఖాస్తు ఫీజు: రూ.650(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
వెబ్‌సైట్: www.irdai.gov.in

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటిస్‌ల** భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 80
ట్రేడ్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అభ్యర్థులు పదోతరగతితో పాటు సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా
ఆసక్తిగలవారు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 24
చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited, Kaiga site, Via Karwar, PO Kaiga ,Dt. Uttara Khand - 581400, Karnataka
వెబ్‌సైట్: www.npcil.nic.in

అడ్మిషన్స్

యుసిఇఒయు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యుసిఇఒయు)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద **ఎంఇ/ ఎంటెక్** ప్రోగ్రామ్స్‌లో ప్రవేశ ప్రక్రియను నిర్వహిస్తోంది.
ప్రవేశ ప్రక్రియ జరిగే తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.uceou.edu

ఇఫ్లూ

హైదరాబాద్‌లోని ద ఇంగ్లీష్ & ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ వారి స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ - **ఎమ్మే (ఇంగ్లీష్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు వ్యవధి: రెండేళ్లు
అర్హత: డిగ్రీ(ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా) పూర్తిచేసి ఉండాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: అక్టోబరు 31
వెబ్‌సైట్: www.efluniversity.ac.in

చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

1. **తేలు జంతు రాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?**
   ఎ) కార్డేట బి) అనెలిడా
   సి) ఆర్థ్రోపొడా డి) మొలస్కా
2. **ఈల్ అనేది ఒక ....**
   ఎ) చేప బి) క్షీరదం సి) పక్షి డి) అకశేరుకం
3. **కర్పరాన్ని కలిగి ఉన్న ప్రోటోజోవన్ ఏది?**
   ఎ) ఎల్ఫీడియం బి) యూగ్లీనా సి) వర్టిసెల్లా డి) నత్త
4. **కింది వాటిలో నిజమైన సర్పం కానిది ఏది?**
   ఎ) గాజు పాము బి) బ్లైండ్ స్నేక్
   సి) సముద్ర సర్పం డి) ట్రీ స్నేక్
5. **వ్యాపనం ద్వారా శ్వాసక్రియను జరుపుకొనే జంతువు?**
   ఎ) తేలు బి) అమీబా సి) వానపాము డి) బి, సి
6. **కింది వాటిలో కర్పరం లేని మొలస్కా వర్గపు జీవి ఏది?**
   ఎ) నత్త బి) డేవిల్ ఫిష్ సి) జలగ డి) ఏదీకాదు
7. **కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.**
   1. హైడ్రా నిడేరియా వర్గానికి చెందుతుంది
   2. హైడ్రాలో నోరు పాయువుగా కూడా పనిచేస్తుంది.
   ఎ) 1 బి) 2 సి) 1 & 2 డి) ఏదీకాదు
8. **పురుషుల్లో ఉండే ప్రొస్టేట్ గ్రంథి బరువు సుమారుగా?**
   ఎ) 20 గ్రాములు బి) 100 గ్రాములు
   సి) 85 గ్రాములు డి) 0.5 గ్రాములు
9. **ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పుట్టిన శిశువు కనీసం ఎన్ని కిలో గ్రాముల బరువు ఉండాలి?**
   ఎ) 2 బి) 4.6 సి) 5.2 డి) 3.3
10. **'బ్లూ బేబీ సిండ్రోమ్' ఉన్న శిశువులో ఏ అవయవంలో లోపాలుంటాయి?**
    ఎ) మెదడు బి) గుండె సి) కన్ను డి) ఊపిరితిత్తులు
11. **'డౌన్స్ సిండ్రోమ్' ఉన్న మానవునిలో ఎన్ని క్రోమోజోములు ఉంటాయి?**
    ఎ) 46 బి) 45 సి) 23 డి) 47
12. **కింది కొన్ని ఎముకలు, అవి ఉండే భాగాల పేర్లు ఉన్నాయి. వాటిలో సరైన జత కానిది?**
    1. టిబియా - కాలు 2. అట్లాస్ - వెన్నెముక
    3. కార్పెల్ - చేయి 4. స్టెపిస్ - ముక్కు
    ఎ) 1, 4 బి) 3, 4 సి) 2, 3, 4 డి) కేవలం 4
13. **'కానిబాల్స్' అంటే?**
    ఎ) రక్తాన్ని పీల్చే జంతువులు
    బి) ఫలాలు తినే జంతువులు
    సి) మలాన్ని తినే జంతువులు
    డి) తమ వంటి జీవులను తినే జంతువులు
14. **కింది వాటిలో జలచర క్షీరదం?**
    ఎ) డుడాంగ్ బి) డాల్ఫిన్
    సి) తిమింగలం డి) పైవన్నీ
15. **వెంట్రుకల్లో ఉండే ప్రోటీన్?**
    ఎ) ఎవిడిన్ బి) కెసిన్
    సి) కెరాటిన్ డి) కెరోటిన్
16. **కింది వాటిలో అవశేష అవయవం?**
    ఎ) జ్ఞానదంతం బి) రెటీనా
    సి) ప్లీహం డి) క్లోమం
17. **'మస్కులర్ డిస్ట్రోఫి' దేనికి సంబంధించిన వ్యాధి?**
    ఎ) మెదడు బి) గుండె
    సి) ఎముకలు డి) కండరాలు
18. **చేప ప్రధాన విసర్జక పదార్థం?**
    ఎ) అమ్మోనియ బి) యూరియ
    సి) యూరికామ్లం డి) క్రియాటిన్
19. **కుల్యా వ్యవస్థను కలిగి ఉండటం ఏ జంతువు లక్షణం?**
    ఎ) వానపాము బి) స్పంజిక
    సి) బద్దెపురుగు డి) అమీబా
20. **కింది ఏ జీవిలో ఏక రక్త ప్రసరణ కలదు?**
    ఎ) కప్ప
    బి) పాము
    సి) ఏనుగు డి) చేప



21. **చేప గుండెలో ఉండే కర్ణికల సంఖ్య?**
    ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
22. **ఏ జంతువు గుండెలో మిశ్రమ రక్తం ఉంటుంది?**
    ఎ) చేప బి) కప్ప సి) మొసలి డి) పైవన్నీ
23. **కింది వాటిలో చేపల లక్షణం కానిది?**
    ఎ) ఉష్ణరక్త జీవులు బి) బంధిత రక్త ప్రసరణ
    సి) బ్రాంఖియల్ హృదయం డి) బాహ్య ఫలదీకరణ
24. **మలంతో పాటు చీము, రక్తం రావడం ఏ వ్యాధి లక్షణం?**
    ఎ) ఫైలేరియ బి) మలేరియ
    సి) అమీబిక్ డీసెంట్రీ డి) టైఫాయిడ్
25. **'ఎంటరిక్ ఫీవర్' అని ఏ వ్యాధిని పిలుస్తారు?**
    ఎ) టైఫాయిడ్ బి) మలేరియ
    సి) ఫైలేరియ డి) క్షయ
26. **ఏ రకానికి చెందిన ట్యూమర్‌ను శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు?**
    ఎ) బినైన్ బి) మాలిగ్నెంట్
    సి) బినైన్, మాలిగ్నెంట్ డి) ఏదీకాదు
27. **అధిక బరువును కలిగి ఉన్న మానవుని బాడీమాస్ ఇండెక్స్ ఎంత?**
    ఎ) 18.5 కంటే తక్కు బి) 18.5 నుంచి 24.9
    సి) 25 నుంచి 29.9 డి) 15.5 కంటే తక్కువ
28. **కీలు చుట్టూ ఉండే ద్రవాన్ని ఏమంటారు?**
    ఎ) పెరిప్లూరల్ బి) పెరికార్డియల్
    సి) సైనోవియల్ డి) మస్తిష్క మేరు ద్రవం
29. **చేతి వేలితో ఒక వ్యక్తి కాలుపై నొక్కినప్పుడు గుంతలు ఏర్పడితే అతడు ఏ వ్యాధితో బాధపడుతున్నట్లు?**
    ఎ) స్కర్వీ బి) గౌట్ సి) ఫ్లోరోసిస్ డి) ఎడిమా
30. **కింది వాటిలో ఎగిరే చేప ఏది?**
    ఎ) టార్పిడో బి) ఎక్సోసీటస్
    సి) డాల్ఫిన్ డి) డెవిల్ ఫిష్
31. **పుట్టిన పిల్లల్లో శ్వాసక్రియ రేటు?**
    ఎ) 32 బి) 16 సి) 25 డి) 70
32. **మానవుని శరీరంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?**
    ఎ) కాలేయం బి) క్లోమం
    సి) మూత్రపిండం డి) ప్లీహం
33. **సీతాకోకచిలుక ఆకారంలో ఉండే వినాళ గ్రంథి?**
    ఎ) పీయూష బి) అధివృక్క
    సి) అవటు డి) పార్శ్వ అవటు(పారా థైరాయిడ్)
34. **టిబియా అనే ఎముక ఏ భాగంలో ఉంటుంది?**
    ఎ) చేయి బి) కాలు సి) చెవి డి) ముక్కు
35. **'వెరికోస్' అనేది దేనికి సంబంధించిన వ్యాధి?**
    ఎ) ధమనులు బి) ఎర్రరక్త కణాలు
    సి) కాలేయం డి) సిరలు
36. **చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?**
    ఎ) బ్రౌన్ ఫ్యాట్ బి) పసుపు ఫ్యాట్
    సి) ఎరుపు ఫ్యాట్ డి) బ్లూ ఫ్యాట్
37. **పాలలో ఉండే ప్రోటీన్ ఏది?**
    ఎ) లాక్టోజ్ బి) ఎవిడిన్ సి) కెరాటిన్ డి) కెసిన్
38. **కింది వాటిని జతపరచండి.**
    1. కణ మేధస్సు ఎ. మైటోకాండ్రియ
    2. కణ కొలిమి బి. కేంద్రకం
    3. కణ భాండాగారం సి. రిక్తిక
    4. కణ వంటశాల డి. హరితరేణువు
    ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి బి) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
    సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి డి) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
39. **మానవుని రక్త వర్గాలకు సంబంధించి ఎన్ని జన్యు రూపాలు ఉంటాయి?**
    ఎ) 4 బి) 2 సి) 8 డి) 6
40. **'పెప్సిన్' అనేది ఒక ......**
    ఎ) హార్మోన్ బి) ఎంజైమ్ సి) విటమిన్ డి) స్టిరాయిడ్
41. **కణం ప్రోటీన్ల కర్మాగారం అని దేన్ని పిలుస్తారు?**
    ఎ) లైసోజోమ్ బి) పెరాక్సిజోమ్
    సి) రైబోజోమ్ డి) మైటోకాండ్రియ
42. **ఎగిరే క్షీరదం అని దేన్ని పిలుస్తారు?**
    ఎ) డాల్ఫిన్ బి) తిమింగలం
    సి) గబ్బిలం డి) డుడాంగ్
43. **పాలలో లభించని పోషక పదార్థం?**
    ఎ) కాల్షియం బి) ప్రోటీన్లు సి) ఇనుము డి) పైవన్నీ
44. **హెర్పిస్ అనే వ్యాధిని కలుగజేసింది?**
    ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రం
    సి) ప్రోటోజోవన్ డి) వైరస్
45. **వైడాల్ : టైఫాయిడ్ :: బయాప్సి : ....**
    ఎ) రేబీస్ బి) క్యాన్సర్ సి) ఎయిడ్స్ డి) సిఫిలిస్
46. **ఉసిరిలో పుష్కలంగా లభించే విటమిన్?**
    ఎ) విటమిన్-సి
    బి) విటమిన్-ఇ
    సి) విటమిన్-డి
    డి) విటమిన్-ఎ



47. **మూత్రంలో విసర్జితమయ్యే విటమిన్?**
    ఎ) విటమిన్-డి బి) విటమిన్-సి
    సి) విటమిన్-కె డి) విటమిన్-ఎ
48. **బటన్, మిల్కి, పాడిస్ట్రా అనేవి?**
    ఎ) పుట్టగొడుగు రకాలు బి) వరి రకాలు
    సి) మామిడి రకాలు డి) అరటి రకాలు
49. **కింది వాటిలో రక్తనాళాలు లేని జంతువు ఏది?**
    ఎ) వానపాము బి) బొద్దింక సి) కప్ప డి) పైవన్నీ
50. **పట్టుపురుగుల పెంపకాన్ని ఏమంటారు?**
    ఎ) ఎపికల్చర్ బి) మోరికల్చర్
    సి) ఒలేరికల్చర్ డి) సెరికల్చర్

సమాధానాలు

1) సి	9) డి	17) డి	25) ఎ	34) బి	43) సి
2) ఎ	10) బి	18) ఎ	26) ఎ	35) డి	44) డి
3) ఎ	11) డి	19) బి	27) సి	36) ఎ	45) బి
4) ఎ	12) డి	20) డి	28) సి	37) డి	46) ఎ
5) డి	13) డి	21) ఎ	29) డి	38) బి	47) బి
6) బి	14) డి	22) బి	30) బి	39) డి	48) ఎ
7) సి	15) సి	23) ఎ	31) ఎ	40) బి	49) బి
8) ఎ	16) ఎ	24) సి	32) ఎ	41) సి	50) డి
			33) సి	42) సి	

ఉద్యోగాలు

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - **మెరైన్ ఇంజనీర్స్** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన **'జీఎంఇ'(గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్) కోర్స్‌**కు దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులో 8 నెలల ప్రీ సీ ట్రైనింగ్, 10 నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది.
మొత్తం ఖాళీలు: 40
కోర్సు ఫీజు: రూ.4,50,000
క్యాంపస్: ఎస్‌సిఐ మారిటైం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, పొవై, ముంబై
కోర్స్ ప్రారంభం: అక్టోబరు 1 నుంచి
అర్హత: ఆగస్టు 31 నాటికి బిఇ/ బిటెక్(మెకానికల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. మహిళలకు రెండేళ్ల సడలింపు వర్తిస్తుంది
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000(ఎస్సీ/ ఎస్టీలకు రూ.500)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: www.shipindia.com

ఇఎస్ఐసి

కోల్‌కతాలోని ఇఎస్‌ఐసి పీజీఐఎంఎస్‌ఆర్ & ఎంసి - కాంట్రాక్ట్ ప్రాతిపదికన **ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 23
పోస్టుల వారీ ఖాళీలు: ప్రొఫెసర్ 7, అసోసియేట్ ప్రొఫెసర్ 11, అసిస్టెంట్ ప్రొఫెసర్ 5
విభాగాలు: అనెస్థీషియా, బ్లడ్ బ్యాంక్/హెమటాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, మైక్రో బయాలజీ, ఆప్తల్మాలజీ, పీడియాట్రిక్స్, పాథాలజీ, సైకియాట్రి, రేడియాలజీ, టిబి/ చెస్ట్ మెడిసిన్.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 69 ఏళ్లు మించరాదు
ఇంటర్వ్యూలు: సెప్టెంబరు 4 నుంచి 7 వరకు
వేదిక: ESIC - PGIMSR & MC, Joka, Kolkata
వెబ్‌సైట్: www.esic.nic.in

జిటిఆర్ఇ

డిఆర్‌డిఒ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ - **గ్రాడ్యుయేట్/ డిప్లొమా/ ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్‌**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 152

- **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీస్**
  ఖాళీలు: 90
  అర్హత: బిఇ/ బిటెక్ / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
  వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
  స్టయిపెండ్: నెలకు రూ.4,984
- **డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీస్**
  ఖాళీలు: 30
  అర్హత: డిప్లొమా / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
  వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
  స్టయిపెండ్: నెలకు రూ.3542
- **ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్** **ఖాళీలు:** 32
  అర్హత: రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ / తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి
  వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
  స్టయిపెండ్: ప్రభుత్వ నిబంధనల మేరకు

ఎంపిక: అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును పోస్టు ద్వారా పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
చిరునామా: The Director Gas Turbine Research Establishment, CV Raman Nagar, Bangalore - 560093

ఎంఒఐఎల్

నాగపూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఒఐఎల్)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు:** 13
పోస్టులు: మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) 8, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ) 3, సీనియర్ మేనేజర్(జియాలజీ) 1, మేనేజర్(సెక్యూరిటీ) 1
అర్హత: పోస్టును అనుసరించి ఎంబిబిఎస్/ పీజీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ)/ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.100
ఇంటర్వ్యూలు: మేనేజర్ పోస్టులకు ఆగస్టు 20న, ఇతర పోస్టులకు సెప్టెంబరు 4న
వేదిక: Moil Bhawan, 1 - A KATOL Road, Nagpur - 440013
వెబ్‌సైట్: www.moil.nic.in


జంబ్లింగ్ వర్డ్స్

1. LBOD ▶..........................
2. SGNI ▶..........................
3. FTLI ▶..........................
4. CPYO ▶..........................

జంతర్‌మంతర్

1. విలయంద్యా ▶..........................
2. వేశంమాస ▶..........................
3. కాగారారం ▶..........................
4. వాదేయంల ▶..........................

చెప్పగలరా?



ఆదిలో ఉన్నా
కానీ మదిలో లేను
యుగంలో ఉన్నా
కానీ సగంలో లేను
నీవులో ఉన్నా కానీ నీరులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో
చెప్పగలరా?

సూక్తి

తెలియని
విషయం గురించి
మాట్లాడటం అంటే -
నీ అవివేకాన్ని
బయటపెట్టుకోవడమే!

చుక్కలు కలపండి



World Photography Day

స్మైల్ ప్లీజ్





ఇంటి పండుగైనా.. బంధువుల ఇంట వేడుకైనా.. నలుగురు కలిసిన ఏ వేళైనా.. ఫొటో క్లిక్‌మంటుంది. అందమైన జ్ఞాపకం కెమెరా కన్నుల్లో మరింత అందంగా ముస్తాబవుతుంది. ఎన్నో భావాలకు, మరెన్నో మధురానుభూతులకు సాక్ష్యంగా నిలిచేది ఫొటో. ప్రకృతి అందాలు, పక్షుల సోయగాలు, సెలయేళ్ల హొయలు, నదీనదాల పరవళ్లు, ఆకాశ అద్భుతాలు, నేలమ్మ ఆనందాలు.. అన్నింటినీ ఇట్టే బంధించేస్తుంది కెమెరా. ఇప్పుడెందుకు ఫొటో ముచ్చట్లు అంటే.. ఈ రోజు 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'!

సెల్ఫీ.. సెన్సేషన్ సృష్టించినా.. గ్రూపీ.. గ్రూపులు కట్టినా.. ఫొటోకు సాటి రావు. మానవ జీవితంలో ఫొటోగ్రఫీకి విడదీయలేని అనుబంధం ఉంది. దానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుపు, తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలక్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్తపుంతలు తొక్కుతోంది.

రెండు గ్రీకు పదాల కలయికే 'ఫొటోగ్రఫీ'. ఫొటో అంటే కాంతి, గ్రఫీ అంటే గీయడం అని అర్థాలు. 'ఫొటోగ్రఫీ' అంటే.. కాంతితో చిత్రాన్ని గీయడం.

ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జె.ఎమ్. డాగ్యూరే, జోసెఫ్ నైస్‌ఫొరెలు 1837లో 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను ప్రపంచానికి పరిచయం చేశారు. 'ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' డాగ్యూరే రూపొందించిన 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను అధికారికంగా గుర్తించింది. ఆ తర్వాత 1839, ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం 'ఫొటోగ్రఫీ ప్రాసెస్' పేటెంట్ హక్కులను సొంతం చేసుకుని, ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుతున్నారు.

మనదేశంలో 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. 1977 ముందు వరకు బ్రిటీష్ వాళ్లు, జమీందారులు, సిపాయిలు మాత్రమే ఫొటోలు తీసుకునేవారు. ఆ తర్వాత ఇది సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. లాలా దీనదయాళ్ భారత్‌లో తొలిసారిగా 'ఫొటోగ్రఫీ'కి శ్రీకారం చుట్టారు.

1860లో నలుపు, తెలుపు రంగుల ఫొటోలు కాస్త రంగుల్లోకి మారిపోయాయి. జేమ్స్ క్లార్క్ మ్యాక్స్‌వెల్ 'కలర్ ఫొటో'లకు ప్రాచుర్యం తెచ్చాడు.

- 1988లో మొదటి డిజిటల్ కెమెరా (ఫ్యూజీ డీఎస్-1పీ) అందుబాటులోకి వచ్చింది. ఫొటోను కంప్యూటరైజ్డ్ ఫైల్‌లో నిక్షిప్తం చేసుకునే సౌకర్యం వచ్చింది.
- మొదటి డిజిటల్ కెమెరాలో 1.4 మెగా పిక్సల్స్ మాత్రమే ఉండేవి. ఆ కెమెరా ధర 10 వేల డాలర్లు.

స్మార్ట్ ఫోన్ రాక ముందు... ఎంతోమంది మెడలో కెమెరా వేసుకుని, లెన్స్ జూమ్ చేస్తూ.. తమకు ఇష్టమైన వాటిని ఫొటోలు తీస్తుండేవారు. అదో గొప్ప కళగా భావించేవారు. రాను రాను జనాలు కెమెరాలు కొనడం మానేశారు. కానీ ఆనాటి తరం కెమెరాల నుంచి ఈ నాటి అత్యాధునిక కెమెరాల వరకు అన్నింటికి చోటు కల్పిస్తూ హర్యానాలోని చక్కర్‌పూర్‌లో 'వింటేజ్ కెమెరా మ్యూజియం' ఇటీవలే ప్రారంభమంది. మనదేశంలోనే ఇది అతి పెద్దది కావడం విశేషం. దాదాపు ఇందులో 700 కెమెరాలు ప్రదర్శనకు ఉంచారు. 100 ఏళ్ల నాటి కెమెరాలను కూడా ఇక్కడ చూడొచ్చు. ఆదిత్యా ఆర్య అనే ఫొటోగ్రాఫర్ వీటిని సేకరించారు.




ప్రపంచంలోనే అతి ఎక్కువ ధర పలికిన కెమెరా 'డాగ్యురే టైప్'. ఇది 168 సంవత్సరాల క్రితం నాటిది. దీని ధర దాదాపు లక్షా ముప్పై రెండు వేల డాలర్లు కావడం విశేషం.

ఔనా!



కాకుల గుంపును 'మర్డర్' అంటారు.

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



ఉరుములకు ఆడవారి కన్నా మగవారే 5 రెట్లు ఎక్కువ ఉలిక్కిపడతారు.

టంగ్ ట్విస్టర్స్



1. How many yaks could a yak pack pack if a yak pack could pack yaks?
2. There's a sandwich on the sand which was sent by a sane witch.
3. There was a little witch which switched from Chichester to Ipswich.

నవ్వుల్ నవ్వుల్




టీచర్ : ఏమ్మా! రాణీ! స్కూలుకు ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి?
రాణి : మా నాన్నగారు రోడ్డు చూసుకుంటూ వెళ్లమన్నారు టీచర్! రోడ్డంతా చూస్తూ వచ్చేసరికి ఈ సమయమైంది.
టీచర్ : !!!!!!!!!!



క్రాస్ వర్డ్

music sound voice sports
editing reports weather announce



జవాబులు

చెప్పగలరా? : ఆయువు
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BOLD 2. SIGN 3. LIFT 4. COPY
జంతర్‌మంతర్ : 1.విద్యాలయం 2. సమావేశం 3. కారాగారం 4. దేవాలయం

విజయవంతమైన 2వ వారం



ASIAN LAXMIKALA CINEPRIDE - మూసాపేట్ 11.15,2.30,6.15,9.30

ASIAN MULTIPLEX KUKATPALLY - కూకట్‌పల్లి 10.40,1.30,7.30,10.30

ASIAN CINEMAS ATTAPUR అత్తాపూర్ 10.40,1.40,4.20,7.40,10.30

ASIAN RADHIKA MOVIEPLEX KAPRA కాప్రా 10.30,1.25,7.25,10.30

ASIAN SHIVA GANGA దిల్‌సుఖ్‌నగర్ 11.15,6.00,9.00

ASIAN CINE SQUARE UPPAL - ఉప్పల్ 10.30,1.30,4.40,7.20,10.20

ASIAN SHAH SHAHENSHAH ఎ/సి - చింతల్ 11.15,6.15

PRASADS 10.45,2.30,5.00,7.30,10.30

PVR CINEMAS INORBIT MALL 10.20,1.30,4.40,7.50,11.00

PVR CINEMAS RK COMPLEX బంజారాహిల్స్ - 10.30,7.30,11.00

PVR CINEMAS CENTRAL MALL ఎ/సి - 10.20,1.30,7.50,11.00

PVR CINEMAS FROUM MALL 10.20,11.15,1.30,4.40,7.50,10.20,11.00

INOX GVK One Mall 11.15,1.00,4.10,7.25,10.40

INOX M.P. Mall 10.50,12.55,4.00,7.05,10.10

BIG Cinemas AMEERPET 10.10,4.00,7.10,10.20

BIG Cinemas SHAMEERPET ఎ/సి - 10.50,4.30,7.10,10.30

Cinépolis KUKATPALLY 11.10,1.50,4.30,7.15,10.25

Cinépolis CCPL - MALKAJGIRI 10.10,1.15,4.20,7.25,10.30

Cinépolis ATTAPUR 10.40,1.40,4.20,7.40,10.30

TIVOLI SECUNDERABAD ఎ/సి - 1.20,7.00,10.15

Cine Planet కోంపల్లి 10.30,1.30,4.30,7.30,10.20

MIRAJ CINEMAS 11.30,2.30,8.00,11.00

T ఇసిఐఎల్ క్రాస్ రోడ్స్ 2.00,6.15,9.00

BVK MULTIPLEX L.B.NAGAR 11.00,4.30,7.30,10.00

ASIAN CINEMAS - హన్మకొండ 10.40,1.40,4.40,7.30,10.25

GEETHA ASIAN - నిజామాబాద్ 10.30,1.30,4.20,7.20,10.30

- వరంగల్ 12.45,3.55,7.05,10.15

SVC ప్రతిమ - కరీంనగర్ 11.00,7.35

శాంతి 70 - నారాయణగూడ 11.15,2.15,6.00,9.00

అర్జున్ 70 ఎ/సి - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30

రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

ప్రశాంత్ 70 - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

SVC Cinemas మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.15,2.15

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15

సంపూర్ణ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15

శ్రీదేవి - రామచంద్రాపురం 11.15,2.15,6.15,9.15

శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00

నాగేంద్ర ఎ/సి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

రాజ్యలక్ష్మి ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00

రంగ ఎ/సి - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00

శారద - కాప్రా 11.00,2.00,6.00,9.00

స్వప్న ఎ/సి - కాటేదాన్ 11.15,6.00,9.00

అలంకార్ - లంగర్‌హౌజ్ 11.00,2.00,6.00,9.00

సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00

సెన్సేషన్ ఇస్నోమ్నియ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00

నర్తకి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30

ఆరాధన - తార్నాక 11.00,2.00,6.00,9.00

BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00

విజేత - బోరబండ 11.00,2.00,6.00,9.00

సూపర్ - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00

రుక్మిణి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00

సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00

శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00



శ్రీమయూరి

70 ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 11.15,2.15

లక్ష్మీకళా - మూసాపేట్ | సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్ | ఎంక్యూబ్ - అత్తాపూర్

వెంకట్రామా - వరంగల్ | పవన్ ఎ/సి - నిజామాబాద్ | భువనేశ్వరి - ఐజా
రాజా డీలక్స్ - కరీంనగర్ | సాయికృష్ణ - కోదాడ | కిన్నెరసాని - ఖమ్మం
బృందావన్ - వనపర్తి | అలంకార్ - సూర్యాపేట | శ్రీనివాస - తాండూర్
మహేశ్వరి - మహబూబ్‌నగర్ | శ్రీనివాస - ఆమన్‌గల్ | SSV గణేష్ - షాద్‌నగర్
కృష్ణ ఎ/సి - సత్తుపల్లి | లక్ష్మీ ఎ/సి - శంకర్‌పల్లి

Contact Nos. 9391013613 / 9849051354

నేడే చూడండి



అంజలి 70 ఎంఎం ఎ/సి - సికింద్రాబాద్
11.15,2.15,6.15,9.15

లక్ష్మీకళ సినీప్రైడ్ మల్టీప్లెక్స్ - మూసాపేట్

రాఘవేంద్ర కాంప్లెక్స్ ఎ/సి - మల్కాజ్‌గిరి

Contact - 9296509333



శ్రీమయూరి

70 ఎంఎం ఎ/సి
ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
6.15,9.15

నేడే చూడండి



దేవి

70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
11.00,2.15,5.45,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

మహాలక్ష్మి 70 ఎంఎం ఎ/సి - కొత్తపేట్ 11.00,2.00

శివపార్వతి 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి 11.15,2.15,6.15,9.15

వెంకటాద్రి 70 ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

PRASADS ఎన్.టి.ఆర్ గార్డెన్ 1.00,3.30,8.15,10.45
PVR మాదాపూర్ 11.35,2.20,7.35,10.20
PVR బంజారాహిల్స్ 1.50,7.45,11.00
PVR - పంజాగుట్ట 4.55,7.40,10.20
PVR కూకట్‌పల్లి 11.10,1.50,5.00,7.35,10.50
INOX బంజారాహిల్స్ 11.00,4.40,7.20,10.00
INOX - కాచిగూడ 10.20,5.25,9.50
BIG Cinemas - అమీర్‌పేట్ 11.00,1.50,7.40
BIG Cinemas ఎ/సి - శామీర్‌పేట్ 1.50,7.40
Cinépolis - కూకట్‌పల్లి 11.40,2.15,7.50
Cinépolis - మల్కాజ్‌గిరి 11.00,2.20,7.55,10.45
Cinépolis - అత్తాపూర్ 11.10,2.00,7.35
Cine Planet ఎ/సి - కొంపల్లి 10.50,4.00,7.40
- దిల్‌సుఖ్‌నగర్ 11.40,2.20,7.40
ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 11.15,2.15,9.15
ASIAN సినీస్క్వేర్ - ఉప్పల్ 11.00,4.50,7.50
ASIAN జిపిఆర్ - కూకట్‌పల్లి 10.50,4.50
ASIAN ఎంక్యూబ్ - అత్తాపూర్ 4.40,10.40
ASIAN రాధిక ఎ/సి - కాప్రా 1.50,7.40
MULTIPLEX BVK - ఎల్.బి.నగర్ 11.15,4.45,10.15
ASIAN శ్రీదేవిమాల్ ఎ/సి - హన్మకొండ
GEETHA ASIAN ఉషాప్రసాద్ ఎ/సి - నిజామాబాద్
SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్

లక్ష్మీకళా సినీప్రైడ్ - మూసాపేట్ 11.15,2.30,9.30
టివోలి ఎక్స్‌ట్రీమ్ - సికింద్రాబాద్ 1.50,4.30,7.10
సినీటౌన్ ఎ/సి - మియాపూర్ 11.30,6.30,9.30
గంగా మల్టీప్లెక్స్ ఎ/సి - గడ్డిఅన్నారం 2.15,9.15
షెహాన్ షా - హెచ్ఎంటి చింతల్ 11.30 AM
స్వప్న ఎ/సి - అబిడ్స్ 11.30,2.30,6.00,9.00
గోకుల్ - ఎర్రగడ్డ 11.15,2.15,6.15,9.15
అంబ - మెహిదీపట్నం 11.15,2.15,6.15,9.15
సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00
సాయిపూజ - సూరారం 11.00,2.00,6.00,9.00

జెమిని కాంప్లెక్స్ - వరంగల్ | **శ్రీదేవి** 70 ఎ/సి - నిజామాబాద్
సుందర్ మ్యాక్స్ - ఖమ్మం | **కృష్ణప్రియ** ఎ/సి - కోదాడ
సాయికృష్ణ - కరీంగనగర్ | **దుర్గా** కళామందిర్ - జగిత్యాల
శ్రీనివాస - మహబూబ్‌నగర్ | **విశ్వరూప** ఎ/సి - కొత్తగూడెం

ఇబ్రహీంపూర్ పాఠశాలకు డబుల్ ధమాకా


ఇబ్రహీంపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల

- ఇటీవల రాష్ట్ర, ఇప్పుడు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌కు ఎంపిక
- 1న ఢిల్లీలో అవార్డుతో పాటు రూ. 50,000 ప్రదానం
- అభివృద్ధికి మంత్రి హరీశ్ ఎత్యేక చొరవ

సిద్దిపేట రూరల్: ఇటీవల రాష్ట్ర స్థాయి 'స్వచ్ఛ పురస్కార్' పొందిన ఇబ్రహీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఇప్పుడు జాతీయ స్థాయి స్వచ్ఛ పురస్కార్‌కు ఎంపికైంది. భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల ఆచరణనే దీనికి కారణం. 'ఇబ్రహీంపూర్' ఇప్పటికే జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ఈ పాఠశాలలో విద్యార్థులు పరిశుభ్రత పాటించడంలో, నైపుణ్యం పెంపొందించుకోవడంలో ముందుంటారు. మలమూత్ర విసర్జనకు మరుగుదొడ్లనే వినియోగిస్తారు. గ్రామంలోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలకే వెళ్తారు. గతంలో ఒకే రోజు రెండు లక్షల మొక్కలు నాటినందుకు గ్రామానికి వచ్చిన గవర్నర్ నరసింహన్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం తీరును చూసి హర్షం వ్యక్తంచేశారు. 2016-2017 జాతీయ స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌ను సెప్టెంబర్ 01న ఢిల్లీలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఆడిటోరియంలో నిర్వహించనున్న కార్యక్రమంలో అందజేస్తారు. ఈ అవార్డుతో పాటు రూ. 50వేల నగదును కేంద్ర ప్రభుత్వం అందించనుంది. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం కార్యక్రమాల వల్ల విద్యార్థులు చైతన్యవంతులయ్యారు. ప్రజలు గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటూ తమ పిల్లలు చదువుతున్న పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రతి నెలా పాఠశాలలో తల్లితండ్రుల సమావేశం నిర్వహిస్తూ పాఠశాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చిస్తుంటారు. ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవతో విద్యార్థులు పరిశుభ్రత పాటించడం, క్రమశిక్షణ, మొక్కల సంరక్షించడం అలవర్చుకున్నారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో పాఠశాలలో మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్ హాల్, నీటి సౌకర్యం కల్పించారు.

పురస్కార్ ఎంపిక విధానం

ఈ పురస్కారం కోసం దేశంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. 2016-17 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని 14 పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో ఇబ్రహీంపూర్ పాఠశాల ఒకటి.




డైనింగ్ హాల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు, సబ్బుతో ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు, పాఠశాల అవరణ


గడిపెద్దాపూర్‌లోని వేంకటేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

అంగరంగ వైభవంగా సామూహిక వరలక్ష్మీవ్రతం

అల్లాదుర్గం: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ వేంకటేశ్వర ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంతో పాటు కూంకుమార్చన కార్యక్రమాన్ని మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకుని కలశాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ పురోహితులు నర్సింహాచారి ఆధ్వర్యంలో పూజలను నిర్వహించి మొక్కలను తీర్చుకున్నారు.


చేర్యాల పట్టణ వీధులగుండా బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా బండ్ల ఊరేగింపు

చేర్యాల: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం చేర్యాలలో మహంకాళీ దేవతకు బండ్ల, బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పెద్దమ్మగడ్డ కాలనీలోని మహంకాళీ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారంగా రైతులు, గ్రామస్థులు బండ్లతో గ్రామంలోని ప్రధాన వీధులగుండా మహంకాళీ ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. పోతరాజు వేషధారణలో ఉన్న పంబాల పూజారి అమ్మవారికి మేకను బలిచ్చారు. నోటితో గావు పట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. డప్పుచప్పుళ్ల దరువు మధ్య యువకులతో కలిసి చిందేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు నివేదించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.


మహంకాళీ అమ్మవారికి బోనం తీసుకెళ్తున్న మహిళలు

యూనివర్సిటీ పనుల్లో వేగం పెంచాలి

- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- కాంట్రాక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ములుగు: హార్టికల్చర్ యూనివర్సిటీ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం ములుగులోని హార్టికల్చర్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సకాలంలో పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయనవెంట ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కాంట్రాక్టర్లు తదితరులున్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పోచారం


అధికారులను పనుల గురించి అడుగుతున్న మంత్రి

'పారదర్శకతను పెంపొందించేందుకే ఈ-పాస్'


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గజ్వేల్‌అర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించేందుకే ఈ-పాస్ విధానాన్ని అమలు చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో రేషన్ బియ్యం పంపిణీ, దీపం కనెక్షన్ల మంజూరుపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రేషన్ విధానంలో పారదర్శకతను పెంపొందించేందుకు ఈ-పాస్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. అంతేకాకుండా రేషన్ డీలర్లు తమ డీడీలు చెల్లించేందుకు కార్యాలయాల చుట్టూ తిరగకుండా బయోమెట్రిక్ విధానంతో నేరుగా షాప్ నుంచే చెల్లించుకునేలా కృషి చేస్తున్నామన్నారు. 25 తేదీలోగా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని ఆయన రేషన్ డీలర్లకు సూచించారు. పేదలందరికీ దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు కృషి చేస్తున్నామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయనవెంట గజ్వేల్ తహసీల్దార్ భిక్షపతి, ఎంఎల్ఎస్‌పాయింట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి తదితరులున్నారు.